

భక్తుల శివే నామస్మరణతో మారు మ్రోగిన శివాలయాలు



'గ్రేటర్' డిప్యూటీ మేయర్ పీఠంపై

కూటమిలో ముదురుతున్న పోరు

జనసేన-బీజేపీ మధ్య పదవీ పంచాయితీ..
పీఠం మాకంటే మాకే కావాలంటూ పట్టుదల!
26 మంది కార్పొరేటర్లతో జనసేన..
8 మంది కార్పొరేటర్లతో బీజేపీ
యాదవ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలంటూ మరోవైపు డిమాండ్
పార్టీ బలమా.. సామాజిక సమీకరణాలా?
తెరపైకి కొత్త రాజకీయ లెక్కలు!

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న కూటమికి ఇప్పుడు డిప్యూటీ మేయర్ ఎంపిక వ్యవహారం కొత్త తలనొప్పిగా మారుతోంది. ఈ పదవి కోసం కూటమిలోని జనసేన, బీజేపీ పార్టీల మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. డిప్యూటీ మేయర్ పదవి తమకే కేటాయించాలని ఇరు పార్టీల నేతలు పటుబడుతుండటంతో కూటమి రాజకీయాల్లో పదవుల పంపకాల అంశం చర్చనీయాంశంగా మారింది. మేయర్ పదవి ఎన్నికతో ముగిసిందనుకున్న రాజకీయ సమీకరణాలు ఇప్పుడు డిప్యూటీ మేయర్ పీఠం చుట్టూ మరోసారి వేడెక్కుతున్నాయి.

జనసేనకు 26.. బీజేపీకి 8 స్థానాలు..

జీవీఎంసీ ఎన్నికల్లో జనసేన పార్టీ 32 వార్డుల్లో పోటీ చేసి 26 స్థానాల్లో విజయం సాధించింది. మరోవైపు బీజేపీ 11 వార్డుల్లో పోటీ చేసి 8 స్థానాలను కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో రెండు పార్టీలు తమ ప్రాతినిధ్యాన్ని నిలబెట్టుకోవడంతో డిప్యూటీ మేయర్ పదవిపై ఇరు పార్టీలూ ఆశలు పెట్టుకున్నాయి. గెలిచిన కార్పొరేటర్ల సంఖ్య, ఎన్నికల్లో సాధించిన ప్రాతినిధ్యం, కూటమిలో తమ పార్టీ పాత్రను ప్రస్తావిస్తూ జనసేన నేతలు ఈ పదవిపై పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. అదే (తరువాయి 8వ పేజీలో)

అక్వాన్ తుపానుతో కోస్తాంధ్రకు ముప్పు!

శుక్రవారం నెల్లూరు-తుని మధ్య తీరం దాటే అవకాశం
గరిష్ఠంగా 145 కి.మీ. వేగంతో గాలులు
విశాఖకు భారీ వర్ష సూచన

విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త:

బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను క్రమంగా బలపడుతోంది. మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుపానుగా, గురువారం నాటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరు--తుని మధ్య తీరం దాటే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపింది. సోమవారం రాత్రి 8.30 గంటల సమాచారం ప్రకారం తుపాను గంటకు 10 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం విశాఖపట్నానికి 670 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది.

గాజువాక డిపోకు

30 ఎలక్ట్రిక్ బస్సులు

జెండా ఊపి ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు
కాలుష్య రహిత, ఆధునిక ప్రయాణానికి శ్రీకారం
ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తున్న కూటమి ప్రభుత్వం
పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే





విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ సేవలు అందించడంతో పాటు కాలుష్య నియంత్రణకు దోహదపడేలా కూటమి ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను ఆధునికీకరిస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గాజువాక ఆర్టీసీ డిపోకు కేటాయించిన 30 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ బస్సులను వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సుల రాకతో గాజువాక పరిధిలో ప్రజా రవాణా మరింత సౌకర్యవంతంగా మారుతుందని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని విద్యుత్ బస్సుల వినియోగం వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. ఈ బస్సులు ఆర్‌కే బీచ్, జగదాంబ, సింధియా, గాజువాక ప్రాంతాలతో పాటు సింధియా-గాజువాక-ఎన్‌ఏడీ -పెందుర్తి, ఆర్టీసీ కాంప్లెక్స్-రైల్వే స్టేషన్-సింధియా-గాజువాక-స్టీల్‌ప్లాంట్ మార్గాల్లో ప్రజలకు సేవలు అందించనున్నాయని వివరిం చారు. 12 మీటర్ల పొడవుతో రూపొందించిన ఈ బస్సుల్లో రెండు ప్రవేశ ద్వారాలు, సీసీటీవీ కెమెరాలు, 35 సీట్లతో పాటు నిలబడి ప్రయా ణించే సదుపాయం కూడా ఉందని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ బస్సులు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందిస్తాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఈ-సేవా పథకం కింద ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీకి 750 ఏసీ బస్సులు మంజూరయ్యాయని, వాటిలో గాజువాక డిపోకు 50 బస్సులు కేటాయించారని పల్లా తెలిపారు. ఇప్పటికే 20 ఏరో ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సులు భోగాపురం విమానాశ్రయానికి సేవలు అందిస్తున్నాయని చెప్పారు. సింహాచలం డిపోకు కూడా 50 బస్సులు కేటాయించగా, 14 బస్సులు చేరుకున్నాయని, మిగిలినవి త్వరలో అందుబాటులోకి రానున్నాయని వివరించారు. డిసెంబర్ నెలాఖరులోగా కేటాయించిన బస్సులన్నింటినీ సేవల్లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూ, పర్యావరణ హితమైన రవాణా సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తోందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం మరో ముందడుగు అని పేర్కొన్నారు.



విశాఖపట్నంలో ముగిసిన 31వ సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ జీ.విద్యాధరిని కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం కలసి అభినందనలు తెలియజేసిన కలెక్టరేట్, రెవెన్యూ అధికారులు.

(ప్రభాతవార్త - విశాఖపట్నం)

ఏయూ ఆర్చరీ జట్టు ఎంపిక పోటీలను

ప్రారంభించిన ఆచార్య ఎ.పల్లవి

విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

ఆంధ్ర విశ్వవిద్యాలయం పురుషుల, ఆర్చరి ఇంటర్ కాలిజియట్ యూనివర్శిటీ క్రీడా జట్టు ఎంపిక సోమ వారం ఏయూ గోల్డెన్ జూబ్లీ క్రీడామైదానంలో జరిగిం ది. అనంతరం ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫీజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎ.పల్లవి మాట్లాడు తూ పురుషులు, మహిళలు విభాగం ఇండియన్ రౌండ్ పోటీల్లో 11 మంది క్రీడాకారులు పాల్గొను న్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్చరీ పోటీల్లో యూనివర్శిటీ జట్లు తరపున పోటీల్లో క్రీడాకారులు పాల్గొని ప్రతిభ సాధించి వర్సిటీకి మంచి పేరు తేవాలన్నారు. గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కిషోర్, ఆర్చరి కోచ్ ఎన్‌ఐఎస్ జి. శివకుమార్, ఏయూ వ్యాయామ విద్యా విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ వై. శ్రీనివాసరావు, స్కాలర్ దిలీప్, క్రీడాకారులు ఉన్నారు.



దంత వైద్యంలో నూతన ప్రమాణాలు నెలకొల్పాలి

గీతం దంత కళాశాల వైట్‌కోట్ కార్యక్రమంలో డా.గీతాంజలి

విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల నేపథ్యంలో నోటి ఆరోగ్యం, దంత సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని గీతం ఇనిస్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి అన్నారు. గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రిలో 2026-27 విద్యా సంవత్సరానికి కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థుల కోసం సోమవారం నిర్వహించిన 'వైట్‌కోట్ ధారణ' కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దంత వైద్య విద్యార్థులు పరి శోధనలపై దృష్టి సారించాలని, వినూత్న ఆలోచనలతో నూతన ప్రమాణాలు నెలకొల్పాలని సూచించారు. ఒత్తిడికి లోనుకాకుండా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ (తరువాయి 8వ పేజీలో)



కలెక్టర్‌కు ఫారం-ఏ అందజేత

విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

విశాఖ జిల్లాలో జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులు కోసం కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థులకు ఫారం-బీ ఇచ్చే అధికారాన్ని పార్టీ అధిష్టానం టిడిపి జిల్లా అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభి రామ్‌కి అప్పగించింది. ఈమేరకు ఇందుకు సంబందించి సూచిం చిన ఫారం-ఏ ను జిల్లా కలెక్టర్‌కి అందజేయడం కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమ వారం చోడే వెంకట పట్టాభి రామ్‌కు పంపారు. ఈ ఫారం-ఏ' పత్రాన్ని జిల్లా టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ తరపున తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం కార్యదర్శులు కే.గోపాల్‌రెడ్డి, వెంకటేష్‌లు సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్‌ను తన ఛాంబర్‌లో కలిసి అందజేశారు.



ఇన్‌స్టాగ్రామ్ పరిచయంతో ఇంట్లోకి వచ్చి

ఘరానా చోరీ!

అనారోగ్యంతో ఉన్నానంటూ ఇంట్లో రోజుల తరబడి మకాం
బీరువాలోని బంగారు, వజ్రాభరణాలు మాయం



విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వజ్రాభరణాలను చోరీ చేసిన ఘటన నగరంలోని అక్కయ్య పాలెంలో వెలుగు చూసింది. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై బాధితురాలు మానేపల్లి నీరజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనారోగ్యంతో ఉన్నానంటూ పరిచయమైన మహిళ ఇంటికి వచ్చి రోజుల తరబడి అక్కడే ఉన్నట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇంట్లోని బీరువాలో భద్రపరిచిన ఆభరణాలను గుట్టుచప్పుడు కాకుండా అపహరించినట్లు ఫిర్యాదులో తెలిపారు. చోరీకి గురైన వాటిలో 11.3 గ్రాముల డైమండ్ నెక్లెస్‌తో పాటు ఇతర వజ్రాభరణాలు, బంగారు ఆభరణాలు ఉన్నట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛ వ్యాధి శాపం కాదు..

చికిత్సతో సాధారణ జీవితం

అవగాహనే ఆయుధం.. వైద్యమే పరిష్కారం
మందులతో 70 శాతం మందిలో మూర్ఛ దాడుల నియంత్రణ
కేజీహెచ్‌లో ఏడాదిలో 5,244 మంది ఓపీకి.. నెలకు 180 మందికి ఈఈజీ పరీక్షలు

విశాఖపట్నం, నవంబర్ 16 (ప్రభాతవార్త):

మూర్ఛ వ్యాధి అనేది శాపం కాదు.. సరైన వైద్య చికిత్సతో బాధితులు సాధారణ జీవితాన్ని కొనసాగించవచ్చని ఆంధ్రా మెడికల్ కళాశాల న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్. గోపి తెలిపారు. నవంబర్ 17న నిర్వహించే జాతీయ మూర్ఛ వ్యాధి అవగాహన దినోత్స వం సందర్భంగా ఆయన మాట్లాడు తూ మూర్ఛపై సమాజంలో ఉన్న అపోహలు, మూఢనమ్మకాలను వీడి వైద్య చికిత్సపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల మందికి పైగా ఈ వ్యాధితో బాధపడుతున్నారని, సరైన చికిత్సతో దాదాపు 70 శాతం మందిలో మూర్ఛ దాడులను నియంత్రించవచ్చని తెలిపారు. మెదడులోని నాడీకణాల విద్యుత్ సంకేతాల్లో అసాధారణ మార్పుల వల్ల మూర్ఛ వస్తుందని, జన్యుపరమైన సమస్యలు, తలకు గాయాలు, మెదడు ఇన్ఫెక్షన్లు, పక్షవాతం, కణితులు తదితర కారణాలు ఉండవచ్చన్నారు. స్నృహ కోల్పోవడం, శరీరం బిగుసుకుపోవడం, చేతులు, కాళ్లు కొట్టుకోవడం, కొద్దిసేపు స్పందించకుండా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు.



కేజీహెచ్‌లో విస్తృత వైద్య సేవలు

విశాఖ కేజీహెచ్‌లో (తరువాయి 8వ పేజీలో)

విశాఖ జిల్లా నూతన డీఆర్వోగా ఎస్.డి. అనిత బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

విశాఖపట్నం జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్వో) ఎస్.డి.అనిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేసిన ఆమె, ప్రస్తుతం విశాఖపట్నంలో ఏపీఐ ఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వ హిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆమె ను విశాఖపట్నం జిల్లా రెవెన్యూ అధికా రిగా నియమించింది. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

త్రిశూలం చెంతకు చేరిన నందీశ్వరుడు

కైలాసగిరికి కొత్త శోభ

కైలాసగిరిపై మరో పర్యాటక ఆకర్షణగా నందీశ్వరుడి విగ్రహం



విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేలా కైలాసగిరిపై మరో ప్రత్యేక ఆకర్షణ అందుబాటులోకి వచ్చింది. మహాశివుడి ఆయుధమైన త్రిశూలం, ఆయన వాహనమైన నందీశ్వరుడి విగ్రహం ఒకేచోట కొలువుదీరడంతో కైలాసగిరి పర్యాటక శోభ మరింత పెరిగింది. ఇప్పటికే కైలాసగిరి కొండపై ఏర్పాటు చేసిన అతి పొడవైన త్రిశూలం, దానికి అనుసంధానంగా ఉన్న డమరుకం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా వీఎంఆర్‌డీఏ అధికారులు నందీశ్వరుడి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎఫ్‌ఆర్‌పీ (ఫ్లైబర్ రీన్‌ఫోర్డ్ ప్లాస్టిక్)తో రూపొందించిన ఈ విగ్రహం 8 అడుగుల 9 అంగుళాల ఎత్తు, 15 అడుగుల పొడవు, 7 అడుగుల 9 అంగుళాల వెడల్పుతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని వీఎం ఆర్‌డీఏ డీఎఫ్ఓ రమణమూర్తి, ఎఫ్ఆర్‌వో శిరీషలు తెలిపారు. నగరానికి చెందిన రమణమూర్తి ఈ నందీశ్వరుడి విగ్రహాన్ని రూపొందించారు. ఇప్పటికే డమరుకంతో కూడిన త్రిశూల్‌తో ప్రత్యేక గుర్తింపు పొందిన కైలాసగిరిపై ఇప్పుడు నందీశ్వరుడి విగ్రహం కూడా చేరడంతో ఆ ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభతో పాటు పర్యాటక కళ మరింత ఇనుమడించింది. శివుడి ఆయుధమైన త్రిశూలం చెంతనే ఆయన వాహనమైన నందీశ్వరుడు కొలువుదీరడం సందర్శకులకు కనువిందు చేయనుంది. ఈ నూతన ఆకర్షణతో కైలాసగిరిని సందర్శించే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.



'గ్రేటర్' డిప్యూటీ మేయర్ పీఠంపై

కూటమిలో ముదురుతున్న పోరు

(7వ పేజీ తరువాయి)

సమయంలో బీజేపీ కూడా తమకు డిప్యూటీ మేయర్ పదవి కేటాయించాలని కోరుతు న్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

మాకే ఎందుకు ఇవ్వకూడదు?

కూటమిలో భాగస్వాములుగా ఉన్నప్పటికీ డిప్యూటీ మేయర్ పదవి విషయంలో ఇరు పార్టీల వాదనలు వేర్వేరుగా ఉన్నట్లు తెలుస్తోంది. జన సేనకు ఎక్కువ సంఖ్యలో కార్పొరేటర్లు ఉండటం తో తమకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ నేతలు భావిస్తుండగా, బీజేపీ సైతం తమ పార్టీకి తగిన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతోం ది. దీంతో ఈ పదవి కేటాయింపు అంశం కేవలం కార్పొరేటర్ల సంఖ్యకే పరిమితం కాకుండా కూటమి పార్టీల మధ్య రాజకీయ అవగాహనకు పరీక్షగా మారుతోంది. ఇరు పార్టీల నేతల మధ్య చర్చలు, నాయకత్వం తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.

యాదవ సామాజికవర్గం నుంచి బలమైన డిమాండ్!

డిప్యూటీ మేయర్ పదవిని బలమైన యాదవ సామాజికవర్గానికి కేటాయించాలనే డిమాండ్ మరోవైపు తెరపైకి వచ్చింది. విశాఖ రాజకీయాల్లో యాదవ సామాజికవర్గానికి ఉన్న ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని ఈ పదవిలో తమ వర్గానికి అవకాశం కల్పించాలని ఆ సామాజికవర్గ నేతలు కోరుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ ప్రాతినిధ్యంతో పాటు సామాజిక సమతుల్యతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని వారు అభిప్రాయపడుతున్నారు. దీంతో డిప్యూటీ మేయర్ ఎంపికలో సామాజికవర్గ సమీకరణాలు కూడా కీలకంగా మారే అవకాశముంది.

అధిష్ఠానం నిర్ణయమే కీలకం!

ఒకవైపు జనసేన, బీజేపీల మధ్య పదవి కోసం పోటీ.. మరోవైపు యాదవ సామాజికవర్గం నుంచి వస్తున్న డిమాండ్.. ఇంకోవైపు కూటమి నాయకత్వం అనుసరించాల్సిన రాజకీయ సమతుల్యత.. ఇలా డిప్యూటీ మేయర్ ఎంపిక వ్యవహారం పలు కోణాల్లో చర్చకు దారితీస్తోంది. జనసేనకు ఉన్న అధిక కార్పొరేటర్ల సంఖ్యకు ప్రాధాన్యత ఇస్తారా? బీజేపీకి పదవిని కేటాయించి కూటమిలో సమతుల్యత పాటిస్తారా? లేక సామాజికవర్గ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది. మేయర్ పీఠం కూటమి ఖాతాలో చేరినప్పటికీ డిప్యూటీ మేయర్ పదవి విషయంలో మాత్రం ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కూటమి ముఖ్య నేతలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? జనసేన, బీజేపీల్లో ఎవరికి అవకాశం కల్పిస్తారు? యాదవ సామాజికవర్గ డిమాండ్‌కు ప్రాధాన్యత ఉంటుందా? అన్నది ఇప్పుడు గ్రేటర్ విశాఖ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. డిప్యూటీ మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందో తేలాలంటే మరికొంతకాలం వేచి చూడాల్సిందే.

దంత వైద్యంలో నూతన ప్రమాణాలు నెలకొల్పాలి

(7వ పేజీ తరువాయి)

వి.వి.నరసింహారావు మాట్లాడుతూ.. వైద్య వృత్తిలోకి ప్రవేశించిన వారు నిరంతరం నేర్చుకుంటూ, విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించడంతో పాటు వారి సమస్యలను ఓపికగా విని, తగిన ధైర్యం చెప్పాలని సూచించారు. పెరియోడాంటిక్స్ విభాగాధిపతి డాక్టర్ రాజా వి. మూర్తి మాట్లాడుతూ.. తెల్లకోటు ప్రాధాన్యతను గుర్తించి, వృత్తి విలువలను పాటిస్తూ వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం నూతన విద్యార్థులకు విభాగాధిపతుల చేతుల మీదుగా తెల్లకోట్లను అందజేశారు. కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ కె.వి. రామప్రసాద్, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం. ఉషారాణి, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వి. కల్యాణ్, పబ్లిక్ హెల్త్ విభాగాధిపతి డాక్టర్ మనీష్‌కుమార్, సీనియర్ వైద్యులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధి శాపం కాదు.. చికిత్సతో సాధారణ జీవితం

(7వ పేజీ తరువాయి)

గత ఏడాది మూర్ఛ లక్షణాలతో 5,244 మంది ఓపీ సేవలు పొందగా, 2,104 మందికి ఈఈజీ పరీక్షలు నిర్వహించారు. ప్రతినెల సుమారు 180 మందికి ఈ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి నెలకు 20 నుంచి 30 మంది వరకు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని తెలిపారు. మూర్ఛ నిర్ధారణలో ఈఈజీ పరీక్ష కీలకమని పేర్కొన్నారు.

మూర్ఛ వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మూర్ఛ వచ్చిన వ్యక్తిని ప్రశాంతంగా పక్కకు తిప్పి పడుకోబెట్టాలి. తలకు గాయం కాకుండా మెత్తటి వస్తువు ఉంచాలి. చుట్టుపక్కల ఉన్న గట్టి, పదునైన వస్తువులను తొలగించాలి. నోట్లో వేళ్లు, చెంచాలు లేదా ఇతర వస్తువులు పెట్టకూడదు. చేతులు, కాళ్ల కదలికలను బలవంతంగా ఆపకూడదు. పూర్తిగా స్పృహలోకి వచ్చే వరకు నీళ్లు, ఆహారం ఇవ్వకూడదు. మూర్ఛ ఐదు నిమిషాలకు మించి కొనసాగినా, వరుసగా దాడులు వచ్చినా వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి. మందు లను క్రమం తప్పకుండా వాడాలని, మూర్ఛ తగ్గిందని వైద్యుల సలహా లేకుండా నిలిపివేయకూడదని డాక్టర్ గోపి సూచించారు. మూర్ఛ బాధితులను వివక్షకు గురిచేయకుండా కుటుంబ సభ్యులు, విద్యాసంస్థలు, సమాజం అండగా నిలవాలని కోరారు. సరైన చికిత్స, కుటుంబ సహకారం, అవగాహనతో బాధితులు చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితాన్ని సాధారణంగా కొనసాగించవచ్చని తెలిపారు.

పంచదార్ల శ్రీఉమా ధర్మ లింగేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా విశేష పూజలు

స్నానాల ధార వద్ద పటిష్ట బందోబస్తు.. క్యూలైన్ల ఏర్పాట్లు





రాంబిల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త:

పవిత్ర కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం పంచదార్ల లో కొలువై ఉన్న శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే పరిసర గ్రామాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుండి సైతం భక్తులు ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణ మంతా శివనామస్మరణతో మారుమోగింది. ఆలయ ప్రాంగణంలోని పవిత్ర గోముఖ ధార వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గర్భాలయంలోని శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చనలు మరియు విశేష పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ?భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఇన్‌ఛార్జ్ కార్యనిర్వహణాధికారి (ఈవో) రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా పుణ్యస్నానాలు ఆచరించే పవిత్ర ధార వద్ద ఎటువంటి తోపులాటలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులను క్రమపద్ధతిలో క్యూ లైన్ల ద్వారా నలుగురు చొప్పున స్నానాల ధార వద్దకు అనుమతిస్తుండటంతో భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటున్నారన్నారు.

పంచాయతీ పోరుకు పెరుగుతున్న వేడి!

చింతపాక సచివాలయ పరిధిలో రెండో రోజు 21 నామినేషన్లు

బుచ్చయ్యపేట, నవంబరు 16, ప్రభాతవార్త :

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రెండో రోజు సందడి నెలకొంది. బుచ్చయ్యపేట మండలం చింతపాక సచివాలయ పరిధిలో సోమవారం ఐదు పంచాయతీల నుంచి మొత్తం 21 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో సీతయ్యపేట అత్యధికంగా 7 నామినేషన్లతో ముందంజలో నిలిచింది. పంచాయతీల వారీగా కరకలో 3, చింతపాకలో 4, పెదపూడిలో 3, సీతయ్యపేటలో 7, పి.పి. అగ్రహారంలో 4 నామినేషన్లు నమోదయ్యాయి. రెండో రోజు నామినేషన్లతో గ్రామాల్లో ఎన్నికల సందడి మరింత పెరిగింది.

ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన ఇద్దరిపై పీడీ యాక్ట్

విదేశీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతకు టోకరా

కేంద్ర కారాగారానికి తరలించిన విశాఖ పోలీసులు

విశాఖపట్నం, నవంబర్ 16 ప్రభాతవార్త

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగ యువతను మోసం చేస్తూ, వారిని సైబర్ నేరాలకు వినియోగిస్తున్న ఇద్దరు నిందితులపై విశాఖ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. వరుసగా నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఇద్దరిపై పీడీ యాక్ట్ ప్రయోగించి కేంద్ర కారాగారానికి తరలించారు.

ఈ కేసులో విశాఖలోని ప్రసాద్ గార్డెన్స్‌కు చెందిన బొంగు మురళి, గాజువాకకు చెందిన చుక్క రాజేశ్ వినయ్ కుమార్‌లను పోలీసులు నిందితులుగా గుర్తించారు. బొంగు మురళిపై గతంలో తొమ్మిది కేసులు, చుక్క రాజేశ్ వినయ్ కుమార్‌పై ఐదు కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.

తక్కువ విద్యార్హతతోనే విదేశాల్లో భారీ వేతనాలు, ఏసీ గదుల్లో కంప్యూటర్ ఉద్యోగాలు కల్పిస్తామంటూ నిరుద్యోగ యువతను వీరు ఆకర్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.2 లక్షల వరకు వసూలు చేసి కంబోడియా, మయన్మార్, లావోస్ వంటి దేశాలకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

అయితే విదేశాలకు చేరుకున్న యువతను అక్కడ చైనా ఆధారిత సైబర్ స్కామ్ కేంద్రాలకు అప్పగిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అక్కడ వారితో భారతీయులకు ఫోన్ కాల్స్ చేయించి, తాము పోలీసులమని, సీబీఐ అధికారులమని బెదిరిస్తూ డిజిటల్ అరెస్టుల పేరుతోనూ, ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతోనూ మోసాలకు పాల్పడేలా చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు.

గతంలో జైలుకు వెళ్లి తిరిగి వచ్చిన తర్వాత కూడా నిందితులు అదే తరహా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇద్దరిపై పీడీ యాక్ట్ అమలు చేసి కేంద్ర కారాగారానికి తరలించినట్లు వెల్లడించారు.

కేజీహెచ్‌లో జాతీయ నవజాత శిశు వారోత్సవాలు ప్రారంభం

"చిన్నారులే... అపారమైన భవిష్యత్తుకు ప్రతిరూపాలు"

లినవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణలో డిశ్చార్జి అనంతర ఫాలోఅప్‌కు అత్యంత ప్రాధాన్యం

విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

ఆంధ్ర వైద్య కళాశాల, కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) పిల్లల వైద్య విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 15 నుంచి 21 వరకు నిర్వహిస్తున్న జాతీయనవజాతశిశువారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ ఆర్.వి.ఎస్. కుమార్, ఆంధ్ర వైద్య కళాశాల పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, డాక్టర్ రత్నకుమారి, ఎన్‌హెచ్‌ఎం నోడల్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. "స్మాల్ బేబీస్ , బిగ్ పోటెన్షియల్ - చిన్న శిశువులు అపారమైన అవకాశాలు" అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాల్లో నవజాత శిశువుల ఆరోగ్యం, పోషణ, టీకాలు, ప్రమాద సంకేతాల గుర్తింపు, ముఖ్యంగా ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత క్రమం తప్పకుండా వైద్య పరీక్షలకు తీసుకురావాల్సిన అవసరంపై అవగాహన కల్పించనున్నారు.

ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి మాట్లాడుతూ, కేజీహెచ్‌లో ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐ సీయూ) ద్వారా నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతి శిశువులోనూ అపారమైన ఎదుగుదల సామర్థ్యం దాగి ఉందని, ఆ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో అందుకునేలా చేయడం వైద్యుల బాధ్యత అని పేర్కొన్నారు.శిశువును ప్రాణాపాయం నుంచి కాపాడటంతోనే మన బాధ్యత ముగియదు. డిశ్చార్జి అనంతరం కూడా ఆ శిశువు ఆరోగ్యంగా పెరుగుతున్నాడా, సరైన పోషణ అందుతోందా, అభివృద్ధి దశలను సక్రమంగా చేరుకుంటున్నాడా అనే విషయాలను నిరంతరం పర్యవేక్షించాలి" అని సూచించారు. ఈ దిశగా అధ్యాపకులు, పీజీ వైద్యులు డిశ్చార్జి అనంతర ఫాలోఅప్ సేవలను మరింత మెరుగుపరచాలని కోరారు. పిల్లల వైద్య విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ, ముఖ్యంగా నెలలు నిండకముందే జన్మించిన శిశువులు, తక్కువ బరువుతో పుట్టిన చిన్నారులకు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు.శిశువు ప్రాణాలను కాపాడటం మొదటి



విజయం మాత్రమేనని, ఆ శిశువు ఆరోగ్యంగా పెరిగి, శారీరకంగా, మానసికంగా పూర్తి సామర్థ్యాన్ని సాధించేలా చూడటమే అసలైన లక్ష్యమని వివరించారు.ఈ లక్ష్యంతో తాను రూపొందించిన "పెడకేర్ డిజిటల్ ఏకోసిస్టం " గురించి వివరించారు. ఈ డిజిటల్ వ్యవస్థలోని వివిధ అప్లికేషన్లు శిశువుల ఎదుగుదల పర్యవేక్షణ, పోషణ, తల్లిపాల ప్రాధాన్యం, టీకాల షెడ్యూల్, అనారోగ్య ప్రమాద సంకేతాల గుర్తింపు, సకాలంలో వైద్య సహాయం పొందడం వంటి అంశాల్లో తల్లిదండ్రులకు, ఆరోగ్య కార్యకర్తలకు ఉపయోగపడేలా రూపొందించినట్లు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వైద్య సేవలతో అనుసంధానించడం ద్వారా డిశ్చార్జి అనంతరం కూడా శిశువుల ఆరోగ్య పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు. "ప్రతి నవజాత శిశువులో ఒక గొప్ప భవిష్యత్తు దాగి ఉంది. ఆ శిశువు ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆరోగ్యంగా ఎదిగి తన పూర్తి సామర్థ్యాన్ని అందుకునేలా చేయడమే మనందరి బాధ్యత" అని డాక్టర్ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా తల్లిదండ్రులకు కంగారూ మదర్ కేర్, తల్లిపాలు, శిశు పరిశుభ్రత, ఇన్ఫెక్షన్ల నివారణ, టీకాలు, ప్రమాద సంకేతాలు, క్రమం తప్పకుండా ఫాలోఅప్ పరీక్షలకు హాజరుకావడం, అభివృద్ధిలో ఆలస్యాన్ని ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించడం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య విభాగ అధ్యాపకులు, పీజీ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల వేళ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు

ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామాల్లో పోలీసుల విస్తృత పర్యటన

వెంకటనగరంలో ఇరువర్గాల నాయకులకు పోలీసుల అవగాహన సదస్సు

పాయకరావుపేట, నవంబరు 16 (ప్రభాతవార్త):

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్ బాబు తీవ్రంగా హెచ్చరించారు.త్వరలో జరగనున్న రెండో విడత సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా గల గ్రామాల్లో స్థానిక పోలీసులు విస్తృత పర్యటన చేస్తూ ఆయా గ్రామాల్లోని విరుపక్షాల నాయకులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, ఎస్ఐ పురుషోత్తం సహ పోలీసు సిబ్బందితో సోమవారం మండలంలోని వెంకట నగరంలో గ్రామ ప్రజలు సహా ఇరువర్గాల నాయకులతో కలసి అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ వినోద్ బాబు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత కక్షలుగా మార్చుకోవద్దని, గొడవలు, వివాదాలు, వ్యక్తిగత



ఆరోపణలు, పరస్పర విమర్శలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు.అనంతరం ఇరువర్గాల నాయకులను పిలిచి ఎన్నికల సమయంలో గొడవలు,అల్లర్లు సృష్టించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ వినోద్ బాబు హెచ్చరించారు. దీనికి స్పందించిన ఆ గ్రామ ఇరువర్గాల నాయకులు,గ్రామ ప్రజలు పోలీసులకు సహకరిస్తామని, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటామని, సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

రాంబిల్లి మండలంలో రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఎంపీడీవో ఎన్ జయ మాధవి

రాంబిల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఎంపీడీవో ఎన్. జయ మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేసిన షెడ్యూల్ మేరకు మండలంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు పంచాయతీలను క్లస్టర్లుగా విభజించామన్నారు. ఈ నెల 18న ఎన్నికల నోటీసు జారీతో పాటు వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అదే రోజు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది.

ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 21న ఉదయం 8:00 గంటల నుండి నామినేషన్ల పరిశీలన చేపడతారు.

తిరస్కరణకు గురైన నామినేషన్లపై 22వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు ఆర్డీవో వద్ద అప్పీలు చేసుకోవచ్చన్నారు. 23న అప్పీళ్లను పరిష్కరిస్తారు. 24వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా, ఆ తర్వాత పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు.



ఈ నెల 29వ తేదీన ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నారు. అనంతరం అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహిస్తారు. అనివార్య కారణాల వల్ల ఉప సర్పంచ్ ఎన్నిక జరగని పక్షంలో మరుసటి రోజు నిర్వహిస్తామని తెలిపారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో రీపోలింగ్ అవసరమైతే 30వ తేదీన నిర్వహిస్తారు. కోర్టు ఉత్తర్వులు లేదా పరిపాలనా కారణాల వల్ల నిలిపివేసిన పంచాయతీలు, పదవులకు ఈ ఎన్నికల నోటీసు వర్తించదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను సులభతరం చేసేందుకు మండలంలోని గ్రామ పంచాయతీలను 8 స్వర్ణ గ్రామం కార్యాలయాల పరిధిలోకి కేటాయించినట్లు ఎంపీడీవో తెలిపారు:

1. కట్టుబోలు స్వర్ణ గ్రామం కార్యాలయం: మురకాడ, మర్రిపాలెం, రాజాల, కుమారపల్లి, కట్టుబోలు.
2. దిమిలి స్వర్ణ గ్రామం కార్యాలయం: దిమిలి, కొత్తూరు, మామిడివాడ.
3. గోకివాడ స్వర్ణ గ్రామం కార్యాలయం: గోకివాడ, మూలజంప.
4. రాజకోడూరు స్వర్ణ గ్రామం కార్యాలయం: కృష్ణాపాలెం, రాజకోడూరు, హరిపురం, వెంకటాపురం.
5. నరసాపురం స్వర్ణ గ్రామం కార్యాలయం: నరసాపురం, కొత్తపట్నం.
6. గోవిందపాలెం స్వర్ణ గ్రామం కార్యాలయం: కొత్తపేట, గోవిందపాలెం, చినకలవలపల్లి, కొప్పుగొండుపాలెం.
7. రాంబిల్లి స్వర్ణ గ్రామం కార్యాలయం: లాలంకోడూరు, రాంబిల్లి.
8. వెల్చూరు స్వర్ణ గ్రామం కార్యాలయం: గోరపూడి, వెల్చూరు, పెదకలవలపల్లి, ఎదుల్లమ్మలోవ.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలని ఎంపీడీవో ఎన్. జయ మాధవి కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 63 వినతులు

విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త:



జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం 63 వినతులు అందినట్లు అదనపు కమిషనర్ పి.ఎం. సత్యవేణి తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి అత్యధికంగా 44, రెవెన్యూకు 7, ఇంజినీరింగ్‌కు 8, ప్రజారోగ్యానికి 2, జోనల్ అడ్మినిస్ట్రేషన్‌కు 2 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఎస్.ఎస్. వర్మ, పల్లి నల్లనయ్య, జాయింట్ డైరెక్టర్ విజయభారతి తదితరులు పాల్గొన్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి, ఫిర్యాదుదారులతో సంప్రదిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జోనల్ కమిషనర్లు, అధికారులను సత్యవేణి ఆదేశించారు.

రాష్ట్రంలో తొలిసారిగా చేతి కుస్తీ పోటీలు

గోడపత్రికను ఆవిష్కరించిన తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, నవంబర్ 16, ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి సారిగా నిర్వహించనున్న చేతి కుస్తీ (ఆర్మ్ రెజ్లింగ్) పోటీల గోడపత్రికను తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. గాజువాకలోని తెదేపా కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'వాజా స్పోర్ట్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో డిసెంబరు 20న విశాఖ ఆర్కే బీచ్ వేదికగా పురుషులు, మహిళలకు భారీ ఎత్తున పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో దేశం లోని వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అన్ని విభాగాల్లో కలిపి విజేతలకు రూ.2.11 లక్షల నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పల్లా రామకిషోర్, పల్లా జ్యోతి, పల్లా కార్తీక్, నందిని, సతీష్, సంతోష్, శ్రవణ్, తేజ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ జ్యోతిర్లింగాలను దర్శించుకున్న కార్పొరేటర్ ఏడువాక

ఆరిలోవ, నవంబర్ 16, ప్రభాతవార్త:



జీవీఎంసీ 16వ వార్డు, 40 గజాల ఏరియాలో కొలువై ఉన్న జ్యోతిర్లింగాలను వార్డు కార్పొరేటర్ ఏడువాక శ్రీమహాలక్ష్మి సన్యాసిరావు దంపతులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదారతో కూడిన పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విలువలను కాపాడుకుంటూనే ప్రజాసేవను పరమావధిగా భావించి ముందుకు సాగుతామని, ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రిమణి, టీడీపీ నాయకులు ఓశెట్టి పైడిరాజు, కాపుశెట్టి రాజేష్, కోన రాజు, గురజాపు వాసు ముత్యమాంబ సేవా సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మారు మ్రోగిన శివాలయాలు.. తరలివచ్చిన భక్తులు

(నక్కపల్లి/ అడ్డు రోడ్డు, ప్రభాతవార్త)



కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో మండలంలోని పలు శివాలయాల్లో తరలివచ్చిన భక్తులు నడుమ శివనామస్మరణతో మారుమ్రోగింది. తరలివచ్చిన భక్తులతో దేవాలయాలు కిటకిట లాడాయి. స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ఉపమాక శివాలయంతో పాటు మండలం లోని పలు శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

పల్లెల్లో ఘనంగా అయ్యప్ప స్వామి పూజలు..

**స్వామి శరణం అంటూ మారుమ్రోగు

గ్రంథాలయ రంగ ప్రముఖులకు ఘన నివాళి



ఆనందపురం, నవంబర్ 16, ప్రభాతవార్త:

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆనందపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ రంగంలో విశేష కృషి చేసిన మహనీయులను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆనందపురం బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఎస్.వి. రమణమూర్తి హాజరయ్యారు. తొలుత గ్రంథాలయ ఉద్యమ పితామహుడు స్వర్గీయ అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పిల్లల్లో పుస్తక పఠన అలవాటు తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచిం చారు. గ్రంథాలయాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, విజ్ఞాన విషయాలను తెలుసుకుంటూ నిరంతరం తమ పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి బి.వి.ఎస్. అప్పారావు, ఆనందపురం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. పైడిరాజు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

కలమట శ్రీనివాసరావుకు శ్రీశ్రీ కళావేదిక ఘన సత్కారం



ఆనందపురం, నవంబర్ 16, ప్రభాతవార్త:

ఆనందపురం మండలానికి చెందిన సాహిత్య, విద్యా ఉపాధ్యాయుడు కలమట శ్రీనివాసరావును శ్రీ శ్రీ కళావేదిక ఘనంగా సత్కరించింది. విజయనగరం జిల్లా కేంద్రంలోని గురజాడ పాఠశాల ఆడిటోరియం లో శ్రీ శ్రీ కళావేదిక, తెలుగు భాష పరిరక్షణ సమితి సంయుక్తంగా నిర్వహించిన 'విజయనగరం సాహితీ వైభవం' జాతీయ సాహిత్య, సంగీత, సాంస్కృతిక మహోత్సవంలో ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ శ్రీ కళావేదిక 177వ సమావేశంలో భాగంగా నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో కలమట శ్రీనివాసరావు 'మనసు మాట' అనే కవితను వినిపించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం ఆయనను నిర్వాహకులు శాలువా కప్పి, జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరి భూషణం, జాతీయ ప్రణాళిక అధికారి డాక్టర్ టి. పార్థసారథి, ఉత్తరాంధ్ర కన్వీనర్ డాక్టర్ డబ్బీరు గోవిందరావు, విజయనగరం జిల్లా కన్వీనర్ సముద్రాల గురుప్రసాద్, జిల్లా అధ్యక్షులు గొర్ల సీతారామమూర్తి, గౌరవ సలహాదారులు డాక్టర్ స్వప్న హైందవి, ప్రధాన కార్యదర్శి సాలూరు సంతోషి, కార్యదర్శి మానాప్రగడ సాహితి, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఈపు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్‌లను మెరుపు వేగంతో స్వాధీనం చేసుకున్న పోలీసులు

బంగారం విలువైన పత్రాలను బాధితులుకు అప్పగించిన ఆరిలోవ క్రైం పోలీసులు



ఆరిలోవ నవంబర్16, ప్రభాతవార్త :

విలువైన పత్రాలు, బంగారం ఉన్న బ్యాగులను తాము ప్రయాణించిన ఊబర్ కార్లో మర్చిపోయిన కుటుం బసభ్యులకు ఆరిలోవ నేర విభాగం పోలీసులు మెరుపు వేగంతో దర్యాప్తు చేసి కొద్ది సేవట్లోనే గుర్తించి వారికి అందజేసిన ఘటన విశాఖలో వెలుగు చూసింది. జి.సింహాద్రి అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమ వారం ఉదయం 11 గంటల సమయంలో పెదవాల్తేరు వద్ద ఏపీ 39 డబ్ల్యూకే 0841 అనే నంబర్ ఉన్న ఊబర్ కార్‌ను బుక్ చేసుకున్నారు. గమ్యస్థానం రవీంద్రనగర్ ప్రాంతం చేరుకున్న తర్వాత కారులో బ్యాగ్‌ల్ని మర్చిపోయి సింహాద్రి కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. ఆ బ్యాగ్‌ల్లో తులం పావు బంగారు ఆభరణాలతో పాటు కొద్దిగా నగదు, కొన్ని విలువైన పత్రాలు ఉన్నాయని బాధితులు న్యాయం చేయాలని కోరుతూ ఆరిలోవ క్రైమ్ విభాగం పోలీసులను ఆశ్రయించారు. ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే ఎస్ఐ వెంకట్రావు, సిబ్బంది ఊబర్ కారును గుర్తించి బ్యాగ్‌ల్ని స్వాధీనం చేసుకుని బాధితులకు సోమవారం అప్పగించారు. ఆరిలోవ క్రైం పోలీసులు జాప్యం చేయకుండా తక్షణమే దర్యాప్తు జరిపి పోగొట్టుకున్న బ్యాగులను గంటల వ్యవధి లోనే స్వాధీనం చేసినందుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

రౌతులపాలెం గ్రామంలో ఘనంగా ముగిసిన క్రీడా పోటీలు



పద్మనాభం, నవంబర్ 16, ప్రభాతవార్త :

కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వికషిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా టి మధు, డొక్కా సీతమ్మ సేవాదేళ ఆధ్వర్యంలో రౌతుల పాలెం గ్రామంలో రెండు రోజుల నుండి నిర్వహించిన క్రీడా పోటీలు సోమవారంతో ఘనంగా ముగిసా యి. అయితే వాలీబాల్ లో ప్రధమ స్థానంలో నిలిచిన రేవిడి జట్టుకు, ద్వితీయ స్థానంలో నిలిచిన కుర్రపల్లి జట్టుకు, కబడ్డీలో ప్రధమ స్థానంలో నిలిచిన శిర్లపాలెం జట్టుకు ద్వితీయ స్థానంలో నిలిచిన అన్నంపేట జట్టుకి, లాంగ్ జంప్‌లో ప్రధమ,ద్వితీయ, తృతీయ బహుమ తులు గెలుచుకున్న ఎం దినేష్,కె భరత్, చందు, 100 మీటర్ల పరుగు పందెంలో ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన సాయి దిలీప్, గోపిచందు లకు పద్మనాభం పోలీస్ ఎం శ్రీను,మాజీ ఎపిడిఒ బాపిరాజు బహుమతులు అందజేసారు.

గురజాడకు నివాళులర్పించిన సాహితీ స్రవంతి

జ్ఞానాపురం, నవంబర్ 16, ప్రభాతవార్త

సాహితీ స్రవంతి నిర్వహించిన సమావేశంలో విశాఖ జిల్లా సాహితీ స్రవంతి అధ్యక్షులు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ మహాకవి గురజాడ జయంతిని గుర్తు చేస్తూ ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం ముఖ్యఅతిథిగా అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ మహాకవి గురజాడ అడుగుజాడలలో సాహిత్యాన్ని నడిపించవలసిన బాధ్యత నేటి రచయితలపై ఉందని సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దండు నాగేశ్వరరావు అక్టోబర్ నెలలో జరిగిన సాహిత్య సమ్మేళనాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజుని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో పి.వి.రమణమూర్తి, వై.ఉమాశంకర్, పి. సింహాచలం, ఎమ్.ఆనందం శర్మ, కె.దానయ్య, శ్రీమతి సుమిత్ర, సంధ్యా ప్రియదర్శిని, శివ జ్యోతి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభం



ఆరిలోవ, నవంబర్ 16, ప్రభాత వార్త :

చిన గ దిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో నేటి నుండి జనవరి 14వ తేదీ వరకు కొనసాగే మండల పూజా దర్శనము, మకర విలక్ దర్శనము, మకర జ్యోతి దర్శనము పుణ్య దినాలను పురస్కరించుకొని ఆలయంలో అన్న సమారాధన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ప్రతిరోజు 250 మంది అయ్యప్ప మాల ధారణ స్వాములకు ఉచితంగా మధ్యాహ్న భోజనాన్ని జనవరి 14వ తేదీ వరకు సమకూరుస్తామని ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు. దాతలు, అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని 1995 వ సంవత్సరం నుండి కొనసాగిస్తున్నామని అప్పారావు తెలిపారు.

పంచాయితీ ఎన్నికలకు సర్వం సన్నద్ధం

26 పంచాయితీలలో 51,951 మంది ఓటర్లు

ఆనందపురంలో అత్యధిక ఓటర్లు..

ముకుందపురంలో అత్యల్ప ఓటర్లు..



ఆనందపురం, నవంబర్ 16, ప్రభాతవార్త:

ఆనందపురం మండలంలో 26 పంచాయతీలు ఉండగా మొత్తం 51,951 ఓటర్లు ఉన్నారు. అందులో 25,599 పురుషులు, 26,352 ?మహిళా ఓటర్లు ఉన్నారు.

పంచాయితీలు వారీగా ఓటర్ల వివరాలు

ఆనందపురంలో 4,379, బోని 1,143, పేకేరు 727, శిర్లపాలెం 777, చందక 1,466, పందలపాక 1,187, గంభీరం 4,175, గిడిజాల 3,183, గొట్టిపల్లి 2,569, కణమాం 1,365, రామవరం 1,154, కుసులవాడ 1,961, ముకుందపురం 686, మామిడిలోవ 2,404, గండిగుండం 1,618, ముచ్చెర్ల 1,422, భీమన్నదొరపాలెం 841, కోలవానిపాలెం 695, పాలవలస 1,639, లొడగలవానిపాలెం 2,271, పెద్దిపాలెం 2,278, శొంఠ్యాం 3,637, తర్లువాడ 2,381, వెల్లంకి 3,856, వేములవలస 2,638, బీపీ కళ్లాలులో 1,499 మంది ఓటర్లు ఉన్నారు.

మండలంలో అత్యధిక ఓటర్లు కలిగిన పంచాయతీగా ఆనందపురం నిలిచింది. ఇక్కడ 4,379 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే అత్యల్ప ఓటర్లు కలిగిన పంచాయతీగా ముకుందపురం నిలిచింది. ఇక్కడ 686 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. మండలంలోని 26 పంచాయతీల్లో అధిక శాతం పంచాయతీలలో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే ఎక్కువగా ఉంది. మొత్తంగా మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే 753 అధికంగా ఉండటం ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్ర ఎంత కీలకమో తెలియజేస్తోంది.

డిసెంబర్ 2 న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ నవంబర్ 19 నుంచి ప్రారంభం కానుం ది. ఇందుకోసం మొత్తం 260 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నవంబర్ 19 ఎన్నికల నోటిఫికేషన్, నవంబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 24, నామినేషన్ల పరిశీలన, నవంబర్ 25, 26 న నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్లు, నవంబర్ 26 అప్పీళ్ల పరిష్కారం, నవంబర్ 27 నామినేషన్ల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటుంది. డిసెంబర్ 2 పోలింగ్ నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు జరిపి విజేతలను ప్రకటిస్తారు.

డిప్యూటీ మేయర్ మాకు ఇవ్వండి : యాదవ సంఘాలు

యాదవ కార్పొరేషన్ కు 6000 కోట్లు నిధులు మంజూరు చేయాలి - కుర్రా శ్రీనివాస్

విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త :

విశాఖ డిప్యూటీ మేయర్ యాదవులకు కేటాయించాలన్న డిమాండ్ ను విశాఖ జిల్లా యాదవ సంఘాలు చేస్తున్నాయి. సంఘాలతో పాటు అనేకమంది రాజకీయ ప్రముఖులు, ఉద్యోగులు ఈ డిమాండ్ ను తెరమీదకి తెస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ విశాఖలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మేయర్ పదవి కాపులకు కేటాయించడంతో డిప్యూటీ మేయర్ యాదవులకు కేటాయించాలని సోమవారం డిమాండ్ చేశారు. వాస్తవానికి లక్షల మంది యాదవులు ఉన్న విశాఖలో మేయర్ యాదవ సామాజికానికి ఇవ్వకుండా రెండు రాజకీయ పార్టీలు అన్యాయం చేశాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాలలో యాదవుల ఓట్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, రాజకీయ పదవులు ఇతర అవకాశాల కల్పనలో వెనుకబడి ఉండటం అన్యాయం అన్నారు. ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ కు 6000 కోట్ల నిధులు విడుదల చేసి ఆ సమాజానికి ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు. డిప్యూటీ మేయర్ పదవి యాదవులకు కేటాయించకపోతే 2029 ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గం తీవ్ర అసంతృప్తికి గురి అయ్యే అవకాశం ఉందని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. దీనిపై యాదవలంతా ఐక్యంగా ఉండి వారి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ సామాజిక నాయకులు అప్పలనారాయణ, వియ్యపు లక్ష్మీ నాయుడు, విసరపు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ముగిసిన భారత్-మయన్మార్ నౌకాదళ విన్యాసాలు

బంగాళాఖాతంలో సముద్ర విన్యాసాలు.. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారానికి మరింత బలం

ఎనిమిదో విడత సంయుక్త నౌకాదళ విన్యాసాలు విజయవంతం





విశాఖపట్నం, నవంబర్ 16, ప్రభాతవార్త:

భారత్-మయన్మార్ దేశాల మధ్య నిర్వహించిన ఎనిమిదో విడత సంయుక్త నౌకాదళ విన్యాసాలు (ఐఎంఎన్ఈఎక్స్--26) విశాఖ పట్నంలో ముగిశాయి. ఈ నెల 14న హార్బర్, సముద్ర దశలను విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం ఈ విన్యాసాలు ముగిసినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. ఈ విన్యాసాల్లో భాగంగా బంగాళాఖాతంలో నిర్వహించిన సముద్ర దశలో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ రాణా, ఐఎన్ఎస్ సుమేధ నౌకలు, మయన్మార్ నౌకాదళానికి చెందిన యూఎంఎస్ కింగ్ సిన్ ఫ్యూ షిన్ నౌకతో కలిసి వివిధ కార్యకలాపాల్లో పాల్గొన్నాయి. సముద్రంలో సమన్వయంతో కూడిన విన్యాసాలు, కార్యాచరణ డ్రిల్స్ నిర్వహించారు. హార్బర్ దశలో ఇరు దేశాల నౌకాదళ అధికారులు, సిబ్బంది మధ్య నిపుణుల స్థాయి చర్చలు, పరస్పర నౌకల సందర్శనలు, వృత్తిపరమైన పరస్పర కార్య క్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇరు దేశాల నౌకాదళాల మధ్య కార్యాచరణ అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం, విధానాలపై అవగాహనను పరస్పరం పంచుకున్నారు. ఈ సంయుక్త విన్యాసాలు రెండు దేశాల నౌకాదళాల మధ్య పరస్పర సమన్వయం, కార్యాచరణ సామర్థ్యాలు, సముద్ర భద్రతకు సంబం ధించిన విధానాలపై అవగాహన పెంపొందించేందుకు దోహదం డ్డాయి. ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది మధ్య సహకారం, పరస్పర అనుసంధాన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంలో ఈ విన్యాసాలు కీలక వేదికగా నిలిచాయని రక్షణ శాఖ పేర్కొంది.

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఆరిలోవ కార్పొరేటర్లు

12-17 వార్డులు కార్పొరేటర్లకు ఘనంగా సత్కారం



ఆరిలోవ, నవంబర్ 16, ప్రభాతవార్త:

చినగదిలి పోలమాంబ కాంప్లెక్స్‌లో ఉన్న అయ్యప్ప దేవాలయంలో సోమవారం జరిగిన పడిపూజ ను పురస్కరించుకొని హాజరైన ఆరిలోవ పరిధిలో ఉన్న జీవీఎంసీ ఎన్ని కల్లో గెలుపొందిన కార్పొరేటర్లకు శ్రీ నార్త్ షిరిడి సాయిబాబా టెంపుల్ ట్రస్ట్ ఘనంగా సన్మానించింది. ఈ ఆలయంలో షిరిడి సాయి బాబాతో సహా ఉన్న వివిధ దేవతామూర్తు లకు నిత్యం దీప, దూప, నైవైద్యములు చేయడమే కాకుండా పేదలకు నిత్య అన్నదానం నిర్విరా మంగా కొనసాగుతుంది. అలాగే ప్రజలచే ఎన్నుకోబడిన నాయకులను ఆహ్వానించి దేవాలయంలో సన్మానం చేయడం మూడు దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఆరిలోవ పరిధిలో ఎన్నికైన 12వ వార్డు కార్పొరేటర్ బాయిన రాణి సునీల్, 13వ వార్డ్ కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్, 14వవార్డు కార్పొరేటర్ కాకి గంగరాజు, 15వార్డు కార్పొ ంటర్ ఒమ్మి అప్పలరాజు, 16వార్డు కార్పొరేటర్ ఏడువాక శ్రీ మహాలక్ష్మి సన్యాసిరావు, 17వ వార్డు కార్పొరేటర్ బుడుమూరి గోవిందుతో పాటు సింహాచల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మదుపాడు సన్యాసిరావు, ప్రముఖ దైవ భక్తుడు నరేంద్ర సాయి లను ఆలయ కమిటీ సభ్యులు మంగళ వాయిద్యాలతో ఆలయం లోనికి ఆహ్వానం పలికారు. దైవ బాబా సన్నిధిలో చైర్మన్ ట్రస్ట్ వానపల్లి అప్పారావు, సోషల్ వర్కర్ బుడ్డిగ సత్యనారాయణ మూర్తి, ఆలయ కమిటీ ఇతర సభ్యులు పుష్పగుచ్చాలి ఇచ్చి సాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అతిథులకు వేద పండితులు సాయి, అయ్యప్ప గురు స్వాములు అయ్యప్ప స్వామి సన్నిధిలో గోత్రనామా లతో పూజలు, జరిపిఆశ్శీరచనములు అందించారు.

గ్రంథాలయ ఉద్యమకారుల సేవలు చిరస్మరణీయం



గాజువాక, నవంబర్ 16, ప్రభాతవార్త :

స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయ ఉద్యమకారుల సేవలపై ఇష్టాగోష్ఠి నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ రాష్ట్ర పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు పి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, దాడిచర్ల హరిసర్వోత్తమరావు గ్రంథాలయ ఉద్యమానికి చేసిన సేవలను కొనియాడారు. సంఘం ట్రెజరర్ కాకి అప్పారావు మాట్లాడుతూ, విజయవాడలో నాగభూషణం స్థాపించిన కళాశాలలో తాను చదువుకుని గ్రంథాలయ సంస్థకు సేవలు అందించానని గుర్తుచేసుకున్నారు. నాటి మహనీయుల సేవల వల్లే నేడు గ్రంథాలయాల ఉనికి నిలిచిందని అసోసియేట్ ప్రెసిడెంట్ వి. పైడిరాజు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ 'కోరమండల్' సంస్థ సహకారంతో గాజువాక గ్రంథాలయం ఆధునికీకరించిన తీరుపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల, స్ప్రింగ్ డాల్, నవ్య వికాస్ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించగా స్ప్రింగ్ డాల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారిణి బి. సూర్యకళ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న అయ్యప్ప స్వామి భక్తి గీతాలు



ఆరిలోవ, నవంబర్ 16, ప్రభాతవార్త :

హనుమంతు వాక ప్రాంతంలో ఉన్న భక్త తుకారాం రామాలయంలో గురుస్వామి డాక్టర్ బైపల్లి సోమేశ్ ఆధ్వర్యంలో వైభవంగా జరిగిన అయ్యప్ప స్వామి వారి పడి పూజాలో గాంధర్వుడు సింగర్ శ్రీనివాస్ పసుపులేటి అయ్యప్ప స్వామి ఆలపించిన భక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి . శబరిమల అయ్యప్ప సన్నిధానం నవంబర్ 16న సోమవారం సాయంత్రం తెరిచి అయ్యప్ప దర్శనం ప్రారంభం కానున్న తరుణంలో భక్తతుకారాం రామాలయంలో వేదమంత్రాలతో విశేష పూజలు జరిగాయి. విశేష సంఖ్యలో అయ్యప్ప మాలాధారనిలో ఉన్న స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పద్మనాభం మండలంలో
భక్తులతో కిటకిట లాడిన శివాలయాలు



పద్మనాభం, నవంబర్ 16, ప్రభాతవార్త:

కార్తీక మాసంలో మొదటి సోమ వారం కావడంతో మండలంలో పలు గ్రామాలలో ఉన్న శివాలయా లు భక్తులతో కిటకిటలాడాయి. బాపిరాజు తాళ్లపలస, కుర్రపల్లి, పద్మనాభం, అనంతవరం, గంద వరం, మద్దిగ్రామం, విలాసఖాన పాలెం, పొట్నూరు, రెడ్డిపల్లి, తునివలస గ్రామాలలో ఉన్న శివాలయాలు తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు శివునికి అభిషేకాలు, విశేష పూజలు చేసారు. మహిళలు గోస్తనీ నది, చెరువులలో అరటి దొప్పలలో దీపారాధన చేసారు.అలాగే ధ్వజస్తంభాలు,నందీశ్వరుల వద్ద దీపారాధన చేసారు. శివనామంతో ఆలయాలు మారుమోగాయి.

జైల్లో ఖైదీల కోసం ఆధార్ కేంద్రం



ఆరిలోవ , నవంబరు 16, ప్రభాతవార్త :

విశాఖపట్నం కేంద్ర కారాగారంలో సోమవారం ఖైదీలకు ఆధార్ నమోదు మరియు ఆధార్ సంబం ధిత సేవలు అందించేందుకు ప్రత్యేక ఆధార్ శిబిరం జైలు అధికా రులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఖైదీల ఆధార్‌లో చోటు చేసుకున్న పొర పాట్లను సరిదిద్దడం, ఆధార కార్డులు లేని వారి వివరాలు సేకరించి కార్డులు మంజూరు చేయడం వంటి విధులను నిర్వహించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు జై లు సూపరిండెంటెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ఖైదీలు సౌకర్యార్థం ఈ శిబిరం ఏర్పాటు చేసినందుకు కేంద్ర కార్యగరంలో ఉన్న ఖైదీలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలి

ముచ్చెర్ల ప్రజలతో సీఐ యర్రం నాయుడుముఖాముఖి



ఆనందపురం, నవంబర్ 16, ప్రభాతవార్త :

రాబోయే పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఆనందపురం సీఐ వి.వి.సి.ఎం. యర్రం నాయుడు కోరారు. విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ఆనందపురం మండలం ముచ్చెర్ల గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో గొడవలు, ఘర్షణలు, అల్లర్లు వంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేందుకు ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని, ప్రజల సహకారమే తమకు బలమని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రేస్ లైన్, గాయత్రినగర్, ఘంటసాలవారి వీధి, విజయవాడ, ఎన్‌టీఆర్ జిల్లా-520008.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(అపెండిక్స్ IV SARFAESI చట్టం నందలి రూల్-8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54/2002) ప్రకారం **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, తుని బ్రాంచ్, తుని, కాకినాడ జిల్లా, ఆం.ప్ర.,** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్షన్ 13(2) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన Secured Over Draft Loan A/c No.**96006277837**) క్రింద **తేది.03.09.2026 నాటికి చెల్లించవలిసిన బకాయి రూ.15,67,375/-** (అక్షరాల పదిహేను లక్షల అరవై ఏడు వేల మూడు వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) **మరియు తేది.03.09.2026** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులుతో కలుపుకుని మొత్తమును చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత:** M/s **మహేంద్ర మ్యాంగో మర్చంట్స్, ప్రొప్రయిటర్: శ్రీ తోట మహేష్ బాబు, తండ్రి: టి. గణేశ్వరరావు,** షాప్ డి నెం.17-2, నర్సీపట్నం రోడ్ జంక్షన్ దగ్గర, పాయకరావుపేట గ్రామం-531126, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా (ఇంతకుముందు విశాఖపట్నం జిల్లా), ఆం.ప్ర., మరియు **ఇంటి చిరునామా: శ్రీ తోట మహేష్ బాబు, తండ్రి: టి. గణేశ్వరరావు,** 25-77, లింగాల తోట కాలనీ, పాయకరావుపేట-531126, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా., (పూర్వపు విశాఖపట్నం జిల్లా.,) ఆం.ప్ర., **మరియు ప్రస్తుతరమైన వారసుడు-3 ఋణగ్రహీత: శ్రీ తోట మహేష్ బాబు, తండ్రి: టి. గణేశ్వరరావు,** (M/s. మహేంద్ర మ్యాంగో మర్చంట్స్ యొక్క ప్రొప్రయిటర్) మరణించిన తనభాదారు-కమ్-హామీదారు లేటు శ్రీమతి తోట నుబ్బ లక్ష్మి, **(తేది.30.07.2026 న మరణించినారు), భర్త: తోట గణేశ్వరరావు,** 25-77, లింగాల తోట కాలనీ, పాయకరావుపేట-531126, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా., (పూర్వపు విశాఖపట్నం జిల్లా.,) ఆం.ప్ర., **చట్టపరమైన వారసుడు-1: శ్రీ తోట గణేశ్వర రావు, తోట, తండ్రి: టి. మాణిక్యం,** 25-77, ఎల్.టి. కాలనీ, పాయకరావుపేట-531126, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా., (ఇంతకుముందు విశాఖపట్నం జిల్లా.,) ఆం.ప్ర., **మరియు మరణించిన తనఖాదారు-కమ్-హామీదారు: లేటు (శ్రీమతి తోట నుబ్బ లక్ష్మి (తేది.30.07.2026 న మరణించినారు) భర్త: టి. గణేశ్వరరావు,** పాయకరావుపేట-531126, ఆం.ప్ర., **మరియు చట్టపరమైన వారసుడు-2: శ్రీ తోట కళ్యాణ్ బాబు, తండ్రి: టి. గణేశ్వరరావు,** 25-77, ఎల్.టి. కాలనీ, పాయకరావుపేట-531126, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా., (ఇంతకుముందు విశాఖపట్నం జిల్లా.,) ఆం.ప్ర., **మరియు హామీదారు-1: (శ్రీ యలమంచిలి శివ గాంధీ, తండ్రి: వై. వీర వెంకట స

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

అనకాపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త



పట్టణంలో పలు శివాలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుండి ఆలయంలో స్వామివారికి అభిషే కాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో కార్తీకమాసం నెలరోజులపాటు భక్తులతో ఆలయాల కిటకిట లాడుతాయి. పలు స్వచ్ఛంద సంస్థలు ఆలయంలో ప్రసాదాలు పంపిణీకార్యక్రమాలు చేపట్టారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. వేల్పుల వీధి శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మెయిన్ రోడ్‌లో ఉన్న సిద్ధి లింగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి స్వామివారి ప్రత్యేక అలంకరణ చేశారు. శారదా నది తీరాన ఉన్న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాల వద్ద ఉన్న కప్ప స్తంభాలు వద్ద భక్తులు నెయ్యితో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాల్లో భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, నవంబర్ 16 (ప్రభాతవార్త)



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత రెండో రోజు నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేబాక గ్రామ పంచా యతీ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నామినేషన్ కేంద్రాల వద్ద ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, నామినేషన్ దాఖలు చేసేందుకు వస్తున్న అభ్యర్థులను, వారికి మద్దతు తెలుపుతున్న మరో ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (కోడ్) పక్కాగా అమలు చేస్తున్నారు. తనిఖీలలో భాగంగా సిబ్బందికి, అధికారులకు జిల్లా ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులందరూ ఒకేసారి రాకుండా, వారికి వేర్వేరు సమయాలు కేటాయిం చేలా చూడా లని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ప్రజలు, కార్యకర్తలు గుమికూడకుండా తగిన జాగ్రత్తలు తీసుకో వాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరిం చారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, అభ్యర్థులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ తనిఖీలలో అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్, అనకాపల్లి టౌన్ సీఐ ప్రేమ కుమార్, ఎస్సైలు రవికుమార్, వెంకటేశ్వరరావు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కసింకోట మేజర్ పంచాయితీ కూటమి సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు



కసింకోట, నవంబర్ 16, ప్రభాతవార్త

మండల కేంద్రమైన కసింకోట మేజర్ పంచాయతీ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి నడిపెల్లి గంగ భవాని సోమవారం పంచాయతీలో నామినేషన్ దాఖలు చేశారు. అనకాపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పీల గోవింద సత్యనారాయణ, జిల్లా బిజెపి అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కసింకోట ఎంపీపీ అభ్యర్థి శ్రీదిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపికృష్ణ, వై ఎ. రాజు, ఎంపీటీసీ రామకోటి దగ్గరుండి సర్పంచ్ అభ్యర్థి చేత నామినేషన్ దాఖలు చేయించారు.

శివ నామస్మరణతో మారుమోగిన శైవ క్షేత్రాలు

కార్తీక మాసం తొలి సోమవారం భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు -తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తజనం.. ప్రత్యేక అభిషేకాలు, దీపారాధనలు

ఎలమంచిలి, నవంబర్ 16, ప్రభాతవార్త



పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రముఖ శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని త్రిమూర్తులు స్వామి ఆలయం, శివాలయం, శేషు గడ్డ వద్ద గల శివాలయం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తడంతో ఎటు చూసినా 'ఓం నమః శివాయ', 'హర హర మహాదేవ' అనే పంచాక్షరీ మంత్రాలతో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు సోమవారం బ్రహ్మముహూర్తంలోనే ఆలయ అర్చకులు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన శివాలయాలతో పాటు ఉప ఆలయాలలోనూ భక్తుల రద్దీ విపరీతంగా కనిపించింది. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. కార్తీక దీపారాధనలతో ఆధ్యాత్మిక శోభ మహిళలు వేకువజామునే ఆలయ ప్రాంగణాల్లోని తులసి కోటలు, ఉసిరి చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాలన్నీ విద్యుత్ దీపాలంకరణలు, పూల అలంకరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఆలయ కమిటీల ప్రత్యేక తొలి సోమవారం కావడంతో భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసిన ఆలయ నిర్వాహకులు ప్రత్యేక బారికేడ్లను, క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, తీర్థ ప్రసాదాల పంపిణీని ఆలయ కమిటీలు పర్యవేక్షించాయి. కొన్ని ఆలయాలలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఆలయాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. కార్తీక మాసం పురస్కరించుకుని నెల రోజుల పాటు ఆలయాలలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనాలు కొనసాగనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో ఉద్యమకారులకు నివాళులు



గొలుగొండ నవంబర్ 16 ప్రభాతవార్త

గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన ఎంతో మంది ఉద్యమకారులు స్ఫూర్తి నేటి గ్రంథాల యాలకు నిలయాలుగా మారాయని ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు బానోజీ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. గ్రంధాలయ ఏర్పాటుకు కృషి చేసి ఎంతోమంది నేటి గ్రంథా లయాల సజీవానికి అమరజీవులయ్యారని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యమానికి కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరి సర్వోత్తమరావు,మాడపాటి హనుమంతరావు మరియు గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయాలపై విద్యార్థులు మక్కువ పెంచుకొని ప్రతిరోజు గ్రంథాలయాలను సందర్శించాలని సూచించారు. గ్రంథాలయాల్లో ఎంతో విజ్ఞానం పొంది పరిచి ఉందని అన్నారు. కార్యక్ర మంలో గ్రంథాలయ అధికారిని ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు.

ప్రతీ గామంలో పంచాయతీ ఎన్నికలు సక్రమంగా జరిగేటట్లు సహకరించండి: జూరెడ్డి మురళి

నక్కపల్లి, ప్రభాతవార్త



మండలంలోని 33 పంచాయితీల్లో జరుగుతున్న పంచాయతీ సర్పంచ్ ,వార్డ్ సభ్యుల ఎన్నికల విషయంలో నిబంధనలకు లోబడి ప్రతి పంచాయతీలో సక్రమంగా ఎన్నికలు జరిగేటట్లు పోలీసులకు సహకరించాలని, గ్రామ పెద్దలు యువకులు పలు రాజకీయ పక్షాలు కృషి చేయాలని ఆ విధంగా ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని సిఐ జూరెడ్డి మురళి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఏ ఒక్కరు కూడా రెచ్చగొట్టే విధంగా ప్రయత్నించవద్దని ఎన్నికలు అనేవి ఆ సమయాల్లో వస్తాయని కానీ బంధుత్వాలు నిత్యం కొనసాగుతాయని ఆ బంధత్వాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణంలో పోటీకి దిగే విధంగా ప్రయత్నించాలని సూచించారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛ పూర్వకమైన వాతావరణంలో ఓటు హక్కును ఉపయోగించుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఇప్పటికే సమస్యాత్మకమైన గ్రామాలపై దృష్టి పెట్టడం జరిగిందని చెప్పారు. సోమవారం నుంచి నోటిఫికేషన్ వెలువడుతుందని 18 నుంచి నామినేషన్ స్వీకరణ ప్రారంభమవుతుందని మా నామినేషన్లు సేకరించి మండలంలోని ఎనిమిది కేంద్రాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని నిబంధనలకు లోబడి నామినేషన్లు వేసేటట్లు సర్పంచ్ అభ్యర్థులు ,వార్డు సభ్యులు సహకరించాలని కోరారు. మండలంలో ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు జరిగేటట్లు పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఏమైనా సమస్యలు తలెత్తితే పోలీసులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో అన్ని గ్రామాల్లో భద్రత చర్యలు చేపట్టడం జరిగిందని చెప్పారు. నిబంధనలను అతిక్రమించి ఏ ఒక్కరు వ్యవహరించిన చర్యలు తప్పు అని హెచ్చరించారు.

ఏ ఎల్ పురంలో వైసీపీని వీడిన మాజీ ఎంపీటీసీ చింతల బుల్లి ప్రసాద్

70 కుటుంబాలతో టీడీపీలో చేరిక -నియోజకవర్గ ఇన్చార్జ్ చింతకాయల రాజేష్ పార్టీ కండువాలతో ఆహ్వానం

గొలుగొండ నవంబర్ 16 ప్రభాతవార్త



ఏ ఎల్ పురం మేజర్ పంచాయతీలో వైసిపికి భారీ షాక్ తగిలింది. మాజీ ఎంపీటీసీ చింతల బుల్లి ప్రసాద్ తమ అనుచరులు 70 కుటుంబా లతో సోమవారం టిడిపిలో చేరారు. ఏఎల్ పురం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ చింతకాయల రాజేష్ పార్టీ కండువాలతో వీరికి ఆహ్వానం పలికారు. గత ప్రభుత్వంలో ఏ ఎల్ పురం మూడో సెగ్మెంట్ నుంచి వైసిపి ఎంపీటీసీగా పనిచేసిన బుల్లి ప్రసాద్ పార్టీలో ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవడంతో తమ అనుచరుగన్నంతో పార్టీని వీడి టిడిపిలో చేరుతున్నట్లు వెల్లడించారు. తమ కుటుంబ సభ్యులంతా టిడిపిలోనే ఉన్నారని దీంతో తాను వారితో కలిసి పని చేసేందుకు సిద్ధమై పార్టీలో చేరాను అన్నారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ పార్టీ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటుందని టిడిపి పార్టీ అంటే కార్యకర్తల పార్టీ అని స్పష్టం చేశారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా మండల నాయకత్వం, నియోజకవర్గ నాయకత్వం ఎప్పుడు వెన్నంటే ఉంటుందని అంటే, కార్యకర్త అయిన తన కష్టాన్ని చెప్పుకునే విధంగా అందుబాటులో ఉంటామన్నారు. ఏ అవసరమైన తీరాలంటే తమ అవసరాన్ని పార్టీ ముందు ఉంచాలని అన్నారు. ప్రతి ఒక్కరికి తమ స్థానాన్ని సుస్థిరంగా ఉంచేందుకే కృషి చేస్తామని అన్నారు. ఏ. ఎల్ పురం పంచాయతీకి నర్సీపట్నం కంటే ఎక్కువ నిధులు ఖర్చు చేశామని ఏ ఎల్ పురం అభివృద్ధి చెందింది అంటే టిడిపి తోనే అయ్యన్నపాత్రుడు కృషి అని అన్నారు. ఇప్పటివరకు 53 కోట్ల రూపాయలు నిధులు ఖర్చు చేశామని తెలిపారు. మరింత అభివృద్ధి దిశగా మేజర్ పంచాయతీని తయారు చేస్తామని ఇందుకు స్థానిక నాయకత్వం ప్రజలతో మమేకం అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు చిటికెల తారక వేణుగోపాల్, అనకాపల్లి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచులు సుర్ల బాబ్జి, గడ్డం సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు జమీలు, టిడిపి సర్పంచ్ అభ్యర్థి చిట్టిబాబు,ఏ ఎల్ పురం టు ఎంపిటిసి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భారీగా హాజరయ్యారు.

మూడు నెలలకే రోడ్డు పక్కన మట్టి గల్లంతు..

వర్షానికే కొట్టుకుపోయిన రోడ్డు ఇరువైపులా మట్టి

-సింగిల్ రోడ్డుపై వాహనదారులకు తప్పని ఇబ్బందులు -అక్కడక్కడా దెబ్బతిన్న రోడ్డు అంచులు

బుచ్చయ్యపేట, నవంబరు 16, ప్రభాతవార్త



నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేశారా? నిర్మాణం పూర్తయి మూడు నెలలు కూడా గడవకముందే రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. బుచ్చయ్యపేట మండలం రాజాం గ్రామంలోని హైస్కూల్ సమీపంలో ఇటీవల నిర్మించిన సింగిల్ రోడ్డుకు ఇరువైపులా వేసిన మట్టి వర్షపు నీటికి కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు అంచులు బలహీనపడి అక్కడక్కడా దెబ్బతిన్నాయి. రోడ్డు పక్కన మట్టి లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఒక వాహనం పక్కకు దిగాల్సి ఉంటుంది. అయితే రోడ్డు ఇరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో వాహనాలు పక్కకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాఠశాల విద్యార్థులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసినప్పుడు రోడ్డు అంచులు మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించేనా?

రోడ్డు నిర్మాణం చేపట్టి మూడు నెలలు కూడా కాకముందే ఇలాంటి పరిస్థితి ఏర్పడటంపై స్థానికులు అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో ఇరువైపులా మట్టి పటిష్ఠంగా వేయకపోవడమే ఈ పరిస్థి తికి కారణమని వారు భావిస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్డు ఇరువైపులా మట్టిని పటిష్ఠంగా వేయడంతోపాటు దెబ్బతిన్న అంచులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా ఉప విద్యాశాఖాధికారి హుస్సేన్

అనకాపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త



అన్ని తరగతుల కంటే పదో తరగతి విద్యార్థు లపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి హుస్సేన్ కోరారు. అనకాపల్లి మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల స్థాయిలను పరిశీలించారు. ఉపా ధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, రికార్డులు, విద్యార్థుల మార్కులు, నమోదులను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకో వాలని కోరారు. తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. ఎప్పటికప్పుడు మార్కులను ఆన్లైన్ చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఆలీ, అనసూర్య, శారద, రాజ్యలక్ష్మి, నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, బేబీ పాల్గొన్నారు.

వడ్డాదిలో ఆసక్తికర రాజకీయాలు!

చక్రం తిప్పిన దొండా రాంబాబు -వైకాపా సర్పంచి అభ్యర్థిగా దాడి గోవిందరావు

బుచ్చయ్యపేట, నవంబర్ 16, ప్రభాతవార్త



మండలంలోని ఏకైక మేజర్ పంచాయతీ వడ్డాదిలో రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరిగాయి. ఇటీవల ఎంపీటీసీగా గెలిచిన వైకాపా నేత దొండా రాంబాబు వ్యూహంతో కూటమికి అనూహ్య పరిణామం ఎదురైంది. కూటమి తరపున సర్పంచిగా పోటీ చేయాలని ఆశించిన తెదేపా నేత, మాజీ ఎంపీపీ దాడి గోవిందరావు చివరకు వైకాపా అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.కూటమి సర్పంచి అభ్యర్థిగా పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా నరేశ్ పేరును ఎమ్మెల్యే రాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ప్రకటించడంతో గోవిందరావు అసంతృప్తికి గురయ్యారు. ఈ పరిణామాన్ని వైకాపా నేతలు తమకు అనుకూలంగా మలచుకుని, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచనలతో ఆయనను తమ అభ్యర్థిగా బరిలోకి దించారు.ఇక్కడ మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. కూటమి అభ్యర్థి దొండా నరేశ్ బత్తుల తాతయ్యబాబుకు మేనల్లుడు కాగా, వైకాపా అభ్యర్థి దాడి గోవిందరావు ఆయనకు సన్నిహిత మిత్రుడు. గతంలో ఇద్దరూ కలిసి తెదేపాలో పనిచేశారు. ఇప్పుడు వేర్వేరు పార్టీల తరపున పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వడ్డాది పంచాయతీ ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

రెండవ గ్రామ పంచాయితీ ఎన్నికలను సమగ్రంగా నిర్వహించాలి

అధికారుల శిక్షణా తరగతుల్లో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త



రెండవ గ్రామపంచాయతీ ఎన్నికలు ఈ నెల 26 నుండి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎన్నికలను సమగ్రంగా నిర్వహించేందుకు శిక్షణా తరగతులు ఎంత దోహదపడతాయని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ సూచించారు. అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో సోమవారం ఉద యం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమావేశ మందిరం రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి, అధికారులకు శిక్షణా తరగతుల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతుల అనంతరము ఎన్నికల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టబడుతోంది అని ఎన్నికల నిబంధనలు, పోలింగ్ సరళి, రిటర్నింగ్ అధికారుల విధులకు సంబంధించి ఈ శిక్షణలో సమగ్ర అవగాహన ఎంతో దోహదపడుతుందని చెప్పారు. డి.పి.ఓ.కిరణ్ కుమార్, జెడ్పీ సి.ఇ.ఓ. రాజ్‌కుమార్, పి.డి. డ్వామా నిర్మలాదేవి, స్పర్ణ గ్రామ స్పర్ణ వార్డు ఏడి సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యలమంచిలి మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

రేపటి నుంచి 8 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ

ఎలమంచిలి, నవంబర్ 16, ప్రభాతవార్త



మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్‌ను సోమవారం అధికారులు విడుదల చేశారు. మండల ఎన్నికల అధికారి, ఇన్‌ఛార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. దీపిక, ఇన్‌ఛార్జ్ పంచాయతీ విస్తరణ అధికారి గిరి ప్రసాద్, సిబ్బందితో కలిసి ఈ ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రచురించారు. ?ఈ సందర్భంగా ఎంపీడీఓ వి. దీపిక మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ బుధవారం నుంచి మండలంలో గుర్తించిన 8 నామినేషన్ కేంద్రాలలో అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. నామినేషన్ సెంటర్లు అనగా ఏటికొప్పాక, బయ్యవరం, పులపర్తి, కృష్ణా పురం, పోతిరెడ్డిపాలెం, పురుషోత్తపురం, లైన్ కొత్తూరు, షేకిల్లపాళెం, ఈ 8 కేంద్రాలలో నియమించబడిన స్టేజ్-1 ఎన్నికల అధికారుల సమక్షంలో నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు నిబంధనల ప్రకారం నామినేషన్లు దాఖలు చేయాలని ఎంపీడీఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



భక్తులకు ప్రసాదం పంపిణీ

అనకాపల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త



బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అనకాపల్లి వారి ఆధ్వర్యంలో కార్తీక్ మాసం మొదట సోమవారం సందర్భంగా కోటవీధిలో వెలిసిన శ్రీ బోగలింగేశ్వర దేవస్థానం లో భక్తులకు ప్రసాదం పంపిణీ చేపట్టారు. ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో. క్లబ్బు గౌరవ అధ్యక్షులు పెంటకోట నర్సింగరావు, చైర్మన్ పిఎస్ అప్పారావు, అధ్యక్షులు బిఎస్ఎంకే జోగినాయుడు కోశాధికారి భర్కికాన శ్రీనివాసరావు, బుద్ధ శివ, కర్రి మల్లేశ్వరరావు, పీలా రామకృష్ణ, బీమర్శెట్టి శ్రీనివాస రావు, బొడ్డేడ రాజేష్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పేట పట్టణంలో 5 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ (ఆపరేషన్) ఈఈ ఎస్.రామకృష్ణ

-చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట నవంబర్ 16 ప్రభాతవార్త



మండల కేంద్రం పాయకరావుపేట పట్టణ పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపట్టనున్న నేపథ్యంలో పాయకరావుపేట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీ ఎల్) అనకాపల్లి డివిజన్ (ఆపరేషన్) ఈఈ ఎస్. రామకృష్ణ వెల్లడించారు.ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 11 కేవి రాజుగారి బీదు ఫీడర్,11 కేవీ పాయకరావుపేట ఫీడర్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రాంతాల్లో పాయకరావుపేట మెయిన్ రోడ్డు, రాజుగారిబీదు, కరణంగారి వీధి, పట్టుసాలీల వీధి, న్యూ కాలనీ, మంగవరం రోడ్డు, బృందావనం, నాగరాజుపేట,పాత హరిజన వాడ, చాకలిపేట ముస్లిం స్ట్రీట్,కంటోన్మెంట్, కొబ్బరితోట తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారని తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా ఆయా ప్రాంతాల వినియోగదారులు ముందస్తుగా గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) అనకాపల్లి డివిజన్ (ఆపరేషన్) కార్యనిర్వాహక ఇంజనీర్ ఎస్.రామకృష్ణ కోరారు.

నక్కపల్లిలో రెండో విడత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురణ

-మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుపై నోటిఫికేషన్

నక్కపల్లి, ప్రభాతవార్త



2026 రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యా లయ అధికారులు సోమవారం రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురించారు. దీనికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో,మండల ఎన్నికల అధికారి కె.చలపతిరావు ,పరిషత్ పరిపాలన అధికారి దెందుకూరి సీతారామరాజు లు కలసి నోటిఫికేషన్ ప్రతులను కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించపచేశారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎంపీడీవో,మండల ఎన్నికల అధికారి చలపతిరావు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు పివివి రాజశేఖర్,కిరణ్ కుమార్, నరసింహమూర్తి, చిన్నం నాయుడు, సీనియర్ అసిస్టెంట్ రాజు, మణికంఠ సహా సిబ్బంది ఉన్నారు.రెండో విడత ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ అధికారికంగా ప్రచురించిన మీదట గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఆరంభం కావడంతో మండల వ్యాప్తంగా పంచాయతీ గ్రామాల్లోని సంబంధిత ప్రజా ప్రతినిధులలో ఎన్నికల సందడి నెలకొన్నది.

ప్రధాన పంటలలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

నక్కపల్లి, ప్రభాతవార్త

జిల్లా వనరుల కేంద్రం అనకాపల్లి వారి ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి

ప్రత్యేక శిబిరాల్లో.అల్లూరి జిల్లా ఎంపీటీసీలు

జ.మాడుగుల, దుంబ్రిగుడ, అరకు వ్యాలీ ఎంపీపీ పదవులు కైవసం కోసం ప్రధాన పార్టీలు పోటా..పోటీ..? -స్వాతంత్ర ఎంపిటిసిల మద్దతు కీలకం

పాడేరు, నవంబర్ 26, ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న 11మండలాల్లో ఏడు మండలాల్లో మండల ప్రజా పరిషత్ అధ్యక్షత (ఎంపీపి) పదవులు కైవసం చేసుకోవడానికి తగిన మెజార్టీ ఎంపిటిసి స్థానాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. అయితే కొయ్యూరు ఎంపీపీ పదవికి కావలసిన మెజార్టీ ఎంపీటీసీలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది.దీంతో జి.మాడుగుల, దుంబ్రిగుడ, అరకు వ్యాలీ మండలాల్లో మెజార్టీ ఎంపీటీసీలు ఏ పార్టీ కి కూడా రాక పోవడంతో ఈ మూడు మండలాల్లో ఎవరు? ఏ పార్టీ నుంచి ఎంపీపీ పదవి కైవసం చేసుకుంటారో తర్జన భర్జనలో ఉన్నారు. దీంతో క్యాంపెయిన్ రాజకీయాలకు తీరతేసారు. పాడేరు, చింతపల్లి, జి.కే.వీధి, అనంతగిరి, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు ఏడు మండలాల్లో వైసిపి మెజార్టీ ఎంపీటీసీలు గెలుపొందగా ఈ ఏడు మండలాల్లో వైసిపి ఎంపీపీ పదవులను కైవసం చేసుకోనుంది.ఒక్క కొయ్యూరు మండలంలో టీడీపీ ఎంపీపీ స్థానాన్ని దక్కించు కొనుంది. మెజార్టీ ఎంపిటిసి స్థానాలు దక్కించు కున్న తెలుగుదేశం పార్టీలో ఎంపీపీ పదవి ఎవరికి ఇవ్వాలనే దానిపై అక్కడ టిడిపిలో కొలిక్కి రాకుండా ఉంది. ఇదిలా ఉండగా జి.మాడుగుల మండలంలో 15 ఎంపిటిసి స్థానాల కు తెలుగుదేశం పార్టీ 5 ఎంపీటీసీలు, వైసిపి 7ఎంపిటిసి స్థానాలు, స్వాతంత్ర ఎంపిటిసి లు ముగ్గురు గెలి చారు. ఐతే ఏ పార్టీకి మెజార్టీ లేకపోవడంతో ఎంపీపీ పదవి కైవసం చేసుకోవడానికి 3 స్వాతంత్ర ఎంపిటిసిల మద్దతు కీలకం కానుండటంతో ముగ్గురు స్వాతంత్ర ఎంపిటిసిల మద్దతు కోసం ఎవరు ప్రయత్నాల్లో ఆయా. పార్టీలు ఉన్నాయి. జి.మాడుగులలో ఈ ముగ్గురు ఎంపీటీసీలు ఏ పార్టీకి మద్దతు తెలిపితే ఆ పార్టీ ఎంపీపీ పదవినీ అధిరోహించినున్నారు. దీంతో ముగ్గురు స్వాతంత్ర ఎంపిటిసిల మద్దతుకై టిడిపి, వైసీపీ నాయ కత్వం పోటీ పడుతున్నారు. జి.మాడుగుల ఎంపీపీ పదవి ఎన్నికల జరిగే వరకు ఉత్కంటే. ఇదిలా ఉండగా దుంబ్రిగుడ మండలంలో 14ఎంపిటిసిలకు గాను 5 వైసిపి ఎంపిటిసిలు, ముగ్గురు టిడిపి ఎంపీటీసీలు, 5 స్వాతంత్ర ఎంపీటీసీలు, ఒక బిజెపి ఎంపీలు ఉన్నారు. దుంబ్రిగుడ మండలంలో ఎంపీపీ పదవి ఏ పార్టీ కైవసం చేసుకోవాలన్నా స్వాతంత్ర ఎంపీటీసీలు మద్దతు కీలకంగా మారింది.ఇక్కడ ఎనిమిది ఎంపీటీసీలు ఉంటేనే గానీ ఎంపీపీ పదవి ఎవరికీ దక్కదు. అరకు వ్యాలీ మండలంలో 16 ఎంపిటిసిలకు గాను టిడిపి 8, వైసిపి 5, బీజేపీ1, జనసేన1, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక ఎంపిటిసి గెలుపొందారు. అరకు వ్యాలీ ఎంపీపీ పదవి చేపట్టాలంటే 9మంది ఎంపీటీసీలు ఉంటేనే గాని ఎంపీపీ పదవి టీడీపీకి దక్కే అవకాశాలు ఉన్నాయి. అయితే ఒక్క కాంగ్రెస్ ఎంపిటిసి మినహా బీజేపీ, జనసేన ఎంపీటీసీలు పొత్తులో భాగంగా వారికి మద్దతు తెలియజేయాల్సి ఉన్నా ఎంపీపీ పదవి జనసేన పార్టీకి పొత్తు ధర్మంలో ఇవ్వాలని పట్టు పార్టీ నాయకులు పట్టుపడుతున్నారు. దీంతో ఎవరికి అరకు ఎంపీపీ పదవి వరిస్తుందో చివరి నిమిషం వరకు ఉత్కంట గానే ఉంది. జి.మాడుగుల, దుంబ్రిగుడ, అరకు వ్యాలీ ఎంపీపీ పదవులు ఎవరికి ఏ పార్టీకి వరిస్తుందో..?

19వ తేదీ వరకు అగవలిసిందే..

ఇదిలా ఉండగా జిల్లాలో ఏడు మండలాల్లో మెజార్టీ ఎంపిటిసి స్థానాలు దక్కించుకుని ఎంపీపీ పదవులు కైవసం చేసుకోనున్న వైసిపి పార్టీలో ఎంపీపీ పదవులకు ఆశావాహులు పోటీ పడటంతో వైసీపీ అధిష్టానం ఎవరిని ఆయా మండలాలకు ఎంపీపీ పేర్లను ఖరారు చేస్తుందో తెలియక టెన్షన్..టెన్షన్లో ఉన్నారు.జిల్లాలో ఉన్న వైసీపీ ఎంపీటీసీలు చేజారిపోకుండా ఉండేందుకు ఎంపీపీ ఎన్నిక రోజు ఈనెల 19వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలను ఎంపిటిసిల ఉండాల్సిన పరిస్థితి. ఎంపీపీ ఎన్నిక రోజు నేరుగా శిబిరాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలించడానికి వ్యూహంలో ఆయా పార్టీలు ఉన్నాయి. ప్రస్తుతం శిబిరాల్లో ఉన్న ఎంపీటీసీలకు సకల మర్యాదలు ఎంపీపీ ఆశావాహులు చేస్తున్నట్లు సమాచారం. అల్లూరి జిల్లాలో ఎంపీటీసీలుగా గెలుపొం దిన వైసీపీ,టీడిపి,బీజేపీ, జనసేన,స్వతంత్ర అభ్యర్థులు ఆయా మండలాల్లో అందుబాటులో లేకుండా ప్రత్యేక శిబిరాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఎంపీపీ పదవులు ఆశిస్తున్న వారు ఎంపిటిసిల బారం మోస్తున్నారు.ప్రత్యేక శిబిరాల్లో ఉన్న వీరంతా ఎంపీపీ ఎన్నిక రోజు 19వ తేదీన ఆయా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించ నున్న ఎంపీపీ ఓటింగ్లో నేరుగా పాల్గొనున్నారు..

బిర్సా ముండ స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల రక్షణకై పోరాడుదాం

సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస్ రావు

పాడేరు,నవంబర్16, ప్రభాతవార్త:



బిర్సా ముండ 151వ జయంతిని పురస్కరించుకొని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్ రావు ఘనంగా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన బిర్సా ముండ స్ఫూర్తితో కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పును జీర్ణించుకోలేక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "బలవంతపు మతమార్పిడులు" అనే అబద్ధపు, విభజనకారి వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరం, ఖండనీయం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తీవ్రంగా ఖండించారు. పాడేరు మండలం, చింతల వీధి గ్రామంలో బిర్సా ముండ 151వ జయంతి కార్యక్రమం సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ఉల్లంఘించడం వల్లనే కూటమి ఓటమి చెందిందని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికి ఏజెన్సీ ప్రాంతాలు తన "బ్రెయిన్‌చైల్డ్" అని సీఎం పేర్కొన్నారని, ఆదివాసీలపై అవమానకర వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అరకు వ్యాలీలో ఆదివాసీలకు స్థానిక ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ మూడేళ్లు గడిచినా అమలు చేయలేదని, ఆదివాసీల అడవులను కార్పొరేట్ కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్టులు, బాక్సైట్ మైనింగ్ పేరిట అక్రమంగా అప్పగించారని, ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వ వైఖరిలో మార్పు రావడం లేదని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని తన ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే స్థానిక ఎన్నికల్లో ఆదివాసీలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు గిరిజన ఓటర్ల తెలివిని, వారి స్వేచ్ఛను ప్రశ్నించేలా ఉన్నాయని, అభివృద్ధి పనులు చేశామని చెప్పుకుంటూ ఫలితాలు రాకపోతే మతం వైపు మళ్లించడం పాలనా వైఫల్యానికి సాకు చెప్పుకోవడమేనని అన్నారు. ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత గల రాజ్యాంగ ప్రతినిధిగా ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఇలాంటి రాజకీయాలు మరో మణిపూర్‌లా పరిణమించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె లోకానాదం మాట్లాడుతూ గిరిజన ప్రజలు తమ స్వంత అనుభవాలు, అభివృద్ధి, సంక్షేమం ఆధారంగా ఓటు వేశారు. ఆ తీర్పును గౌరవించకుండా మతం పేరుతో దూషించడం గిరిజన సమాజాన్ని అవమానించడమే. ఇది ప్రజా స్వామ్య విలువలకు వ్యతిరేకం. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలి. మతం, కులం పేరుతో సమాజాన్ని విభజించే రాజకీయాలను వ్యతిరేకిస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో నిజమైన అభివృద్ధి, సంక్షేమం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, గిరిజన ప్రజల తీర్పును గౌరవించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సురేంద్ర, ముంచింగ్ పుట్ జడ్పీటీసీ కొర్ర త్రినాథ్,ఉమ మహేశ్వరరావు, ఎస్.బి. పోతురాజు, బి.సి హెచ్ పడల్, గంగరాజు, దాస్, కార్తీక్, జీవన్, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సంకాడ పంచాయితీ టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా దేశగిరి గోవిందరావు నామినేషన్ దాఖలు

గూడెం కొత్తవీధి, నవంబర్ 16, ప్రభాతవార్త



సంకాడ గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా దేశగిరి గోవిందరావు నామినేషన్ దాఖలు చేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలో నిలిచేందుకు ఆయన నామినేషన్ సమ ర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు మద్దతుగా నిలిచి ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. సంకాడ పంచాయతీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలుస్తున్న దేశగిరి గోవిందరావుకు పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది.

దామనపల్లి సర్పంచ్ అభ్యర్థిగా కుందరి సత్యవతి నామినేషన్

గూడెం కొత్తవీధి, నవంబర్ 16, ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున దామనపల్లి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కుందరి సత్యవతి భారీ జనసందోహం మధ్య నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కుందరి రామకృష్ణ మాట్లాడుతూ, గత పదేళ్లుగా తనకు ఆదరాభిమానాలు చూపించి సర్పంచ్‌గా గెలిపించిన పంచాయతీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో గతంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, అసంపూర్తిగా మిగిలిన పనులను సత్యవతి గెలుపుతో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటూ, ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కుందరి సత్యవతిని భారీ మెజార్టీతో గెలిపించి దామనపల్లి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ విజయం ద్వారా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, 2029 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు విజయానికి దామనపల్లి సర్పంచ్ ఎన్నిక పునాది కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పంచాయతీలోని వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని కుందరి సత్యవతికి తమ మద్దతు తెలిపారు.



ఏపీ ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ ఎన్రోల్మెంట్ డ్రైవ్



పాడేరు,నవంబర్16, ప్రభాతవార్త

ఏపీ ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా అసిస్టెంట్ కమీషనర్ అర్.శశి కుమార్, డిఈఓ కార్యాలయ సిబ్బంది మురళీ మోహన్, చంద్ర మోహన్, పాడేరు మండలంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ సోమవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమం పాడేరు ఐసిడిఎస్ శారదాదేవి ఆధ్వర్యంలో జరుగుతున్న మండల అంగన్వాడీ టీచర్‌ల ట్రైనింగ్ ప్రోగ్రాం, రాయిగెడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ హైస్కూల్ లో దొకులూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ హైస్కూల్‌లను సందర్శించి ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఐసీడీఎస్‌లో పనిచేయుచున్న ఉద్యోగులకోసం ప్రత్యేకంగా అడ్మిషన్ల గడువు పెంచారని, టెంత్ క్లాస్ చదవని ప్రతీ ఒక అంగన్వాడి ఉద్యోగీ టెంత్‌లో జాయిన్ అవ్వాలని అదేవిధంగా టెంత్ పాస్ అయిన ప్రతీ ఒక్క అంగన్వాడి ఉద్యోగీ ఇంటర్ లో అడ్మిషన్ పొందాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ అవకాశాన్ని అందరూ అంది పుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. చదువుకు దూరమైన వారికి, చదువు మధ్యలో మానేసి బడికి, కాలేజీకి దూరమైన వారికి, అదేవిధంగా పాఠశాలల్లో, కాలేజీల్లో చదువుకునే అవకాశం లేని బాలబాలికలకు వయోజనులకు ఇది సువర్ణావకాశం. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహించబడతాయి.

ఓపెన్ 10వ తరగతిలో చేరుటకు అర్హతలు

చదవగలిగిన వ్రాయగలిగిన పరిజ్ఞానం కలిగి ఆగస్టు 31, 2026 నాటికి 14 సంవత్సరాలు నిండిన వారందరూ అర్హులే అన్నారు. ఓపెన్ ఇంటర్మీడియట్లో చేరుటకు అర్హతలు : 10వ తరగతి పాస్ అయి ఆగస్టు 31, 2026 నాటికి 15 సంవత్సరాలు నిండిన వారందరూ అర్హులే. అడ్మిషన్ ఫీజు చెల్లించడానికి ఈ నెల 30వ. తేదీ చివరి తేదీ. అసిస్టెంట్ కమీషనర్ ఆర్.శశికుమార్, పాడేరు ఐసిడిఎస్ సిడిపిఓ శారదా దేవి, డిఈఓ కార్యాలయ సిబ్బంది మురళీ మోహన్, చంద్ర మోహన్, ఆయా స్కూల్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు సౌర దీపాల పంపిణీ

పెదవలస పాఠశాలలో అవేర్ గ్రూప్, ఏబీఎస్‌వైజెడ్ సేవా కార్యక్రమం

గూడెంకొత్తవీధి, నవంబర్ 16, ప్రభాతవార్త



పెదవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనిచ్చే లక్ష్యంతో అవేర్ గ్రూప్, యంగ్‌సాప్ట్ కంపెనీకి చెందిన ఏబీఎస్‌వైజెడ్ సంస్థలు సంయుక్తంగా సోమవారం ఉచితంగా సౌర విద్యుత్‌తో పనిచేసే చదువుల దీపా లను పంపిణీ చేశాయి. 'జీవితాల్లో వెలుగులు.. భవిష్యత్తుకు భరోసా'లి అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ అంతరాయాలు ఉన్నప్పటికీ విద్యార్థులు సాయంత్రం వేళల్లో నిరంతరాయంగా చదువుకునేందుకు అవకాశం కల్పించారు. అవేర్ గ్రూప్ గౌరవ వ్యవస్థాపక ఛైర్మన్ పి.కె.ఎస్. మాధవన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి, స్వచ్ఛమైన ఇంధన వినియోగానికి తమ సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ దీపాలు విద్యార్థుల చదువుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ, అవేర్ గ్రూప్ ప్రతినిధి కంకిపాటి కృష్ణ పడాల్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగులు నింపేలా సహకరించిన రెండు సంస్థల ప్రతినిధులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

అల్లూరి జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికలకు

రాష్ట్ర ఎన్నికల కమీషన్ షెడ్యూల్ విడుదల

రెండవ విడత నాలుగు మండలాల్లో పంచాయితీ ఎన్నికలు -ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ

పాడేరు,నవంబర్26,ప్రభాతవార్త

అల్లూరి సీతారామ రాజు జిల్లాలో రెండో విడత సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమీషన్ అనిల్ చంద్ర పూనేఠ రిటైర్డ్ ఐఏఎస్ సోమవారం విడుదల చేసారు. అల్లూరి జిల్లాలో 244 గ్రామ పంచాయతీలకు 2446వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు మొదటి విడత మూడు మండలాలకు, రెండవ విడత నాలుగు మండలాలకు ఎన్నికలు నిర్వాహణకు సంబంధించి షెడ్యూల్ ను విడుదల అయింది.తొలి విడత గ్రామ పంచాయితీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగా ప్రస్తుతం జిల్లాలో నామినేషన్ల పర్వం కొనసాగుతున్నాయి. రెండవ విడత ఎన్నికల షెడ్యూల్ సోమవారం విడుదల అయింది. రెండవ విడత సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల అనంతగిరి మండలాల పరిధిలో ఉన్న 87గ్రామ పంచాయితీ 880 పోలింగ్ కేంద్రాల్లో గ్రామ సర్పంచ్ స్థానాలకు, వార్డు మెంబర్ల స్థానాలకు రెండవ విడత ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆయా నాలుగు మండలాల పరిధిలో ఉన్న సర్పంచ్,వార్డు మెంబర్ల స్థానాలకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరణ కార్యక్రమం ఏర్పాటు చేసిన నామినేషన్లు కేంద్రాల్లో అభ్యర్థుల నుంచి స్వీకరించ నున్నారు. ఈ నాలుగు మండలాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్లు కేంద్రాల్లో ఉదయం10.30 గంటల నుంచి అభ్యర్థుల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించ నున్నారు. నామినేషన్లు స్వీకరణ ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ సాయంత్రం 5గంటల వరకు స్వీకరించ నున్నారు. 21వ తేదీ ఉదయం 8గంటల నుంచి పరిశీలన, తిరస్కరించిన నామినేషన్లు సంబంధిత రెవెన్యూ అధికారి వద్ద అభ్యర్థులు సాయంత్రం 5 గంటలు లోగా అప్పీల్ చేసుకోవాలి. 23వ తేదీన ఆప్పీలేట్ అధికారి పరిష్కరించ నున్నారు.నామినేషన్లు వేసిన అభ్యర్థులు నామినేషన్లు ఉప సంహరణ 24వ తేదీ మూడు గంటలు లోగా ఉప సంహరణ చేసుకోవాలి.పోటీ చేసిన అభ్యర్థుల జాబితా 24వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలు తర్వాత అనంతరం పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు. రెండవ విడత 29వ తేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆయా కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణ జరగనుంది. మధ్యాహ్నం 2గంట నుంచి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు. సర్పంచ్ ఫలితం అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక అధికారులు నిర్వహించనున్నారు. ఏదైనా అనివార్య కారణాలు వలన ఉప సర్పంచ్ ఎన్నిక జరగని యెడల మరుసటి రోజు సెలవు రోజు అయినా ఉప సర్పంచ్ ఎన్నిక. ఊర్వహించాలి. ఒక వేళ రీ పోలింగ్ అనివార్యమైతే 30వ తేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అధికారులు పోలింగ్ నిర్వహించనున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడించనున్నారు.

మండలంలో పంచాయితీ ఎన్నికల పర్వం మొదలైంది..



23 పంచాయతీలకు 8 నామినేషన్ కేంద్రాలు : ఎంపీడీవో ధర్మారావు

ముంచంగిపుట్టు, నవంబర్ 16, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల పర్వం మొదలైంది. మండలంలో గల 23 గ్రామ పంచాయతీలకు గాను 8 నామినేషన్ కేంద్రాలను ప్రతిపాదించడం జరి గిందని ఎంపీడీవో కే.ధర్మారావు తెలిపారు.నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18.11.2026 నుండి 20.11.2026 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు స్టేజ్-1 ఆఫీసర్ వద్ద సమర్పించాలని ఎంపీడీవో తెలిపారు.

నామినేషన్ కేంద్రాల వివరాలు..

1.జోలపుట్టు, పనసపుట్టు, మాకవరం పంచాయతీలకు- జోలపుట్టు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 2.జర్తుల, జెర్రెల, కరిముఖిపుట్టు పంచాయతీలకు-కరిముఖిపుట్టు పంచాయతీ కార్యాలయం వద్ద 3. బంగారుమెట్ట, దారెల, కిలగాడ పంచాయతీలకు-కిలగాడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 4. కించాయిపుట్టు, సుజనకోట, వనబసింగి పంచాయతీలకు-కించాయిపుట్టు స్వర్ణ గ్రామ కార్యాలయం వద్ద 5. బాబుసాల, బూసుపుట్టు, కుమడ పంచాయతీలకు-కుమడ రైతు సేవా కేంద్రం వద్ద 6.బరడా, బుంగపుట్టు, లక్ష్మీపురం పంచాయతీలకు- లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 7.పెదగూడ, ఏనుగురాయి పంచాయతీలకు- పెదగూడ స్వర్ణ గ్రామ కార్యాలయం వద్ద 8.దొడిపుట్టు, రంగబయలు, వణుగుమ్మ పంచాయతీలకు- జోలపుట్టు హైస్కూల్ నందు 9వ తరగతి గదిలోనిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో కోరారు.

రెండో రోజు సర్పంచ్ పదవికై నామినేషన్ల హోరు..!

కొయ్యూరు, నవంబర్ 16 ప్రభాతవార్త



గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల కు సంబంధించి తొలిరోజైన ఆదివారం నామినేషన్లు ప్రక్రియ మందకొడుగా సాగినప్పటికీ, రెండో రోజైన సోమవారం ఊబందుకుంది. మండలంలోని 33 పం చాయతీలకు చెందిన సర్పంచ్ ఆశావా హులు అధికారుల ఏర్పాటుచేసిన 12 నామినేషన్ కేంద్రాలలో నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో భాగంగా రాజేంద్రపాలెం నుండి ఇప్పటికే సురబోయిన చిన్ని నామినేషన్ దాఖలు చేయగా, సోమవారం అంబటి రామారావు నామినేషన్ దాఖలు చేశారు, అలాగే అలాగే మాజీ సర్పంచ్ పీఠా సింహాచలం నామినేషన్ వేశారు. కొయ్యూరు నుండి ధుమంతి సత్య కుమారి, ఎం.మాకరం నుండి జీలుగు బాలరాజు, చింతలపూడి నుండి సిగ్గే ఉదయకుమార్, చీడిపాలెం నుండి జలుమూరి సత్యవతి, రేవళ్ల నుండి జన్ని నాగేంద్ర, రాజేంద్రపాలెం నుండి నర్సి కృష్ణ, నర్సి కిరణ్, రత్నంపేట నుండి అరిమెల రాజు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే మిగతా అన్ని పంచాయితీల నుండి ఆశావహులు టిడిపి జనసేన, బిజెపి, వైసిపి మద్దతు తరపున నామినేషన్లు వేశారు.



రెండో రోజు 94 సర్పంచ్, 225 వార్డు మెంబర్లుకై నామినేషన్లు

ఎంపీడీవో జీడివి ప్రసాద్ రావు వెల్లడి



కొయ్యూరు, నవంబర్ 16, ప్రభాతవార్త

మండలంలో 33 పంచాయతీలకు గాను పంచాయతీ ఎన్నికలకు సంబం ధించి జరిగిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజైన సోమవారం 94 మంది సర్పంచు పదవులకై, 225 మంది వార్డు మెంబర్లకై నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో జీడివి ప్రసాద్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉండగా నామినేషన్లకు గాను ఈనెల 17 మంగళవారం వరకు గడువు ఉండడంతో ఇంకా ఎంతమంది నామినేషన్లు వేస్తారో ఎదురుచూడాల్సిందే.

పెసా చట్టం కమిటీ సభ్యులు సర్పంచ్ పదవికి పోటీ చేయాలంటే

ముందస్తుగా రాజీనామా చేయాలి : ఐటీడీఏ పీఓ ఆదిత్య వర్మ

పాడేరు, నవంబర్16, ప్రభాతవార్త

జిల్లాలో గ్రామ సభల ద్వారా ఎన్నుకోబడిన పెసా చట్టం కమిటీ సభ్యులుగా కొనసాగుతున్న వారు పంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేయదలచుకుంటే, తప్పనిసరిగా తమ పదవికి రాజీనామా చేసిన తర్వాతే అర్హులవుతారని అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ సోమవారం తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి పిసా చట్టం సభ్యులుగా ఎన్నుకోబడి ప్రభుత్వం నుండి గుర్తింపు పొంది ఉన్న సభ్యులు, జిల్లాలో గల పీసా చట్టం సభ్యులందరు సర్పంచ్ ఎన్నికల పోటీకు అనర్హులని, వారు సర్పంచ్ ఎన్నికల నామినేషన్ వేసిన ప్రతి ఒక్కరు నామినేషన్ల ఉపసంహరణ (విత్‌డ్రాయల్) గడువు ముగియడానికి కనీసం ఒక రోజు ముందుగానే తన సభ్యత్వంను అల్లూరి జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వారి నుండి పెసా సభ్యత్వ నికి రాజీనామా చేసి ఆమోదం పత్రాన్ని పొంది, సంబంధిత పంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి స్క్రూట్నీ సమయనికి ముందుగా సమర్పించి, ఆమోదం పొంది ఉండాలని ఆయన తెలిపారు.ఆలా నిబంధనల మేరకు ముందస్తు ఆమోదం లేని పక్షంలో నామినేషన్ చెల్లుబాటు కాదని పేర్కొన్నారు.

శివాలయంలో భ